# దత్తాత్రేయుని 24మంది గురువులు

- తటవర్తి రాజ్యలక్ష్మి



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# దత్తాత్రేయుని 24 మంది గురువులు



రచన : తటవర్తి రాజ్యలక్ష్మి

ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2024
కాపీలు : 1,000

వెల : రూ. 70/-

పుస్తకముల కొరకు
**తటవర్తి వీర రాఘవరావు**
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.
సెల్ : 9440309812
email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


1) దత్తాత్రేయుని 24 మంది గురువులు .......................... 3

2) గురువు వద్ద శిష్యుడి ప్రవర్తన ఎలా ఉండాలి? ............... 29

3) జీవుడైన మానవుడు దేవుడిగా ఎదగాలంటే? ................. 40

4) విశేషమైన జ్ఞానం పొందాలంటే? ............................ 47

5) మానవుడు ఆచరించవలసిన కొన్ని ధర్మాలు! ................. 52

6) "అజ్ఞానుల్లో రకాలు" ........................................... 60



**తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?**

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు **6.30 to 7.30 a.m.** వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

# దత్తాత్రేయుని 24 మంది గురువులు

దత్తాత్రేయుల వారు అత్రి మహాముని, అనసూయ దంపతులకి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల యొక్క అంశవల్ల జన్మించడం జరిగింది. దత్తాత్రేయుడ్ని అందరూ అవధూతగా కొలుస్తారు .

దత్తాత్రేయుడు ప్రకృతి నుంచి 24మంది గురువుల్ని ఎంచుకున్నారు. ఆయన ఆ గురువులనుంచి నేర్చుకుని ఒక జ్ఞాన భాండాగారంగా  మిగిలి పోయాడు.

ఒకసారి ఆయన అలా వెళుతూ ఉంటే  యదుమహారాజు ఆయన్ని చూసి, ఈయన ఇంత జ్ఞాన ఘనిగా కనిపిస్తున్నాడు. ఆనంద స్వరూపుడిగా కనిపిస్తున్నాడు. ఈయన ఎవరు? అని అనుకుంటూ... ఆయన దగ్గరికి వెళ్ళి స్వామి మీరు ఎంతో ఆనంద స్వరూపుడిగా కనిపిస్తున్నారు, ఒక జ్ఞాన భాండాగారంగా కనిపిస్తున్నారు, ఇంత ఆనందాన్ని, జ్ఞానాన్ని మీరు ఎలా పొందారు? మేము ధర్మార్థ కామ మోక్షాలలో, కామము మరియు అర్థాల వెనకాలే పడ్డాము. సంపదల్లో సుఖం ఉందని అనుకున్నాము, భార్యాపుత్రులలో ఆనందం వుందని అనుకుంటూ వారి కోసమే తాపత్రయపడుతూ, తిరుగుతున్నాము. మీకు సంసారం కాని, భార్య పుత్రులు కాని ఎవరు ఉన్నట్టు కనిపించడం లేదు. అయినా కూడా ఇంత ఆనంద స్వరూపులుగా ఎలా కనిపిస్తున్నారు? అని దత్తాత్రేయస్వామి వారిని అడగడం జరిగింది.

యదుమహారాజు అడిగినప్పుడు దత్తాత్రేయుడు ప్రకృతిలోని తన 24 మంది గురువుల గురించి వివరంగా చెప్పడం జరిగింది. వీరిద్దరి సంవాదం ఉద్ధవ గీతలో శ్రీకృష్ణుడు ఉద్దవునికి బోధించిన దాంట్లోనుంచి తెలుసుకోవచ్చు.

అందులో దత్తాత్రేయుడు ఎలా పుట్టాడు? మరి ఆ గురువులను ఎలా ఎంచుకుని తాను ఒక జ్ఞాన భాండాగారంగా ఎదిగాడు అన్నది తెలియచేశాడు.

దత్తాత్రేయుడు ఏమన్నాడంటే? నేను ఎవరి దగ్గర ఏదీ నేర్చుకోలేదు, ప్రకృతిని చూసి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. నేను 24 మంది గురువులను ప్రకృతి నుంచి ఎంచుకున్నాను అన్నారు.

నేను ఎలా వుండాలి? ఏమి వదలాలి? ఏమి పొందాలి? అన్నవి కూడా నేను ప్రకృతి నుంచే నేర్చుకున్నాను అని దత్తాత్రేయుడు చెప్పడం జరిగింది.

అందుచేత ఇప్పుడు మనం ఆ గురువులు ఎవరో! మనం తెలుసుకుందాం.

దత్తాత్రేయుల వారు పంచభూతాలు నా మొట్టమొదటి గురువులు అన్నారు. పంచభూతాలు అంటే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం. ఈ ఐదింటిని మొట్టమొదట ఆయన గురువులుగా ఎంచుకున్నారు. వారి నుండి ఎన్నో నేర్చుకున్నారు. ఆయన పంచభూతాలలోని భూమినుండి ఏమి నేర్చుకున్నారో తెలుసుకుందాం.

## 1) భూమి

దత్తాత్రేయులవారు భూమి నుంచి ఓర్చుకోవడం నేర్చుకున్నాను అన్నారు. చూడండి భూమి ఏం చేసినా ఓర్చుకుంటూ ఉంటుంది. ఆ భూమి కి వున్న ఓర్పు ఎవరికీ లేదు. అందుకే ఎవరైనా ఏదైనా ఓర్చుకుంటే భూదేవంత ఓర్పు ఉందమ్మా నీకు అని అంటారు. అంటే భూమిని ఓర్పుకి, సహనానికి ప్రతీక అని భూదేవితో పోలుస్తారు అందరూ.

ఆయన భూదేవి నుంచి నేర్చుకున్న ఓర్పుతో... గత జన్మల కర్మలు అంటే ప్రారబ్ధ కర్మలు ఏమైనా ఉంటే, అవి ఎలాంటివైనా సరే, ఎంత కష్టమైనా సరే వాటిని నేను ఓర్చుకుంటాను అని చెప్పాడు. చూడండి ఒక రమణ మహర్షి కాని, రామకృష్ణ పరమహంస గాని అంతటి మహా భయంకర క్యాన్సర్ రోగం వచ్చినా వాళ్ళు ఎప్పుడు దానికోసం ఆలోచించకుండా ఓర్చుకున్నారు.

ఎందుకంటే ప్రారబ్ధం అనేది వచ్చినప్పుడు అది తప్పనిసరిగా అనుభవించాలి అని వారికి తెలుసు కాబట్టే వాళ్లు ఓర్చుకున్నారు. అందుకే దత్తాత్రేయుడు ప్రారబ్ధ కర్మల వల్ల ఏ కష్టం వచ్చినా ఓర్చుకోవాలని భూమిని చూసి నేను నేర్చుకున్నాను అన్నాడు.

అంతేకాదు భూమి నుంచి పర్వతాలు పుట్టాయి, వృక్షాలు పుట్టాయి. పర్వతాలను చూసి ఆయన స్థిరత్వం నేర్చుకున్నారు. గాలి వానలు రానివ్వండి, సునామీలు రానివ్వండి, తుఫానులు రానివ్వండి ఎన్ని వచ్చినా పర్వతాలు వేటికీ చలించకుండా అలాగే ఉంటాయి.

అందుకే ఏ గాలివానలు, తుఫానులు, సునామీలు, భూకంపాలు లాంటివి వచ్చినా పర్వతాలు ఏ విధంగా చలించకుండా వుంటాయో దత్తాత్రేయుల వారు కూడా ఏది వచ్చినా చలించకుండా వుండాలని పర్వతాలను చూసి నేర్చుకున్నాను అని చెప్పారు. సామాన్యంగా మానవులు చిన్న కష్టం వచ్చినా కృంగిపోవడం, చిన్న భోగానికి పొంగిపోవడం చేస్తారు, కానీ పర్వతాలు అలా వుండవు.

## 2) జలం

దత్తాత్రేయులవారు జలంనుంచి శుద్ధత్వం నేర్చుకున్నారు. అంటే చూడండి ప్రపంచంలో ఎన్నో రకాల మురికి, కాలుష్యాలు వున్నాయి. కానీ ఆ మురికిని నీళ్లతో కడిగితే శుద్ధమవుతాయి, శుభ్రంగా వుంటాయి, పవిత్ర మవుతాయి.

చూడండి నీటితో విగ్రహాలను అభిషేకం చేస్తారు, శుభ్రం చేస్తారు. గుడిని, గుడి ప్రాంగణాన్ని నీటితోనే శుభ్రం చేస్తారు.

చూడండి మానవులు ఇంటిని, వంటిని, జుట్టుని, వస్త్రాలను నీటితో శుభ్రం చేస్తారు. నీరు లేకపోతే శుభ్రం చేయలేరు, జీవించలేరు. మానవులే కాదు ఇతర జీవరాసి కూడా నీటిని శుభ్రానికి, త్రాగడానికి ఉపయోగిస్తారు. నీరు లేకపోతే జీవరాసి అంతరించిపోతుంది కూడా. అన్ని జీవులకు ఆహారమైన వృక్ష జాతి కూడా నీరు లేకపోతే అంతరించిపోవలసిందే! అందుకే నీరు జీవరాసికి అంత ఉపయోగం. అలా నీరు పనికి రాని వాటిని పనికి వచ్చే వాటిలా ఎలా మారుస్తుందో! మనం తెలుసుకోవచ్చు.

దత్తాత్రేయులవారు కూడా నీరు లాగే తన దగ్గరికి వచ్చిన శిష్యులకు మురికి లాంటి అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానమనే పవిత్రతను ఇస్తారు. అలా నేను నీళ్ళని చూసి నేర్చుకున్నాను అని దత్తాత్రేయుల వారు చెప్తారు.

అలాగే యోగులు తన దగ్గరికి వచ్చిన వారికి ధ్యానం ద్వారా అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగు ఇస్తారు; పత్రిగారు కూడా తన దగ్గరకు వచ్చిన వారికి అదే చేసేవారు. నేను, మావారు అదే చేస్తున్నాము.

## 3) అగ్ని

చూడండి అగ్ని అన్నింటిని అంటే మంచి, చెడు అని చూడకుండా భస్మం చేస్తుంది.

అలా వివక్షత లేకుండా అగ్ని అన్నింటిని ఎలా భస్మం చేస్తుందో! అలాగే ధ్యాన యోగి తన కష్టాలని, సుఖాలని సమానంగా స్వీకరిస్తాడు. దత్తాత్రేయులవారు కూడా అగ్ని లాగే మంచి, చెడు అని చూడకుండా అన్నిటినీ స్వీకరిస్తారు, అలా నేను అగ్నిలాగ అన్నిటి పట్ల సమదృష్టితో ఉంటాను అని చెప్పడం జరిగింది.

అగ్నికి ప్రత్యేకమైన ఆకారం లేదు. ఏ ఆకారంలో ప్రవేశిస్తుందో ఆ రూపమే దాలుస్తుంది. కట్టెలో ప్రవేశిస్తే దాని రూపమే అవుతుంది. కర్ర కాలితే పొడుగ్గా కనిపిస్తుంది, గంప కాలితే గుండ్రంగా కనిపిస్తుంది. అలా ఏ వస్తువులోకి అగ్ని ప్రవేశిస్తే ఆ రూపమే ధరిస్తుంది అగ్ని దానికంటూ ప్రత్యేకమైన రూపం లేదు.

అలాగే ఆత్మకు కూడా ఏ రూపము లేదు. ఏ శరీరం దాలిస్తే ఆ రూపమే దానిది అన్నట్టు ఉంటుంది.

అందుకే అందరిలో ఉన్న ఆత్మ ఒకటే అని అగ్ని నుంచి నేను నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పడం జరిగింది.

## 4) వాయువు

వాయువు రెండు విధాలుగా ఉంటుంది.

1) అంతర్వాయువు, 2) బహిర్వాయువు.

అంతర్వాయువు ప్రాణ శక్తిగా శరీరంలో ఉంటుంది. ప్రాణ శక్తి వుంటేనే మనిషి జీవిస్తాడు. ప్రాణశక్తి లేకపోతే శరీరం శవమవుతుంది, మానవులు, జంతువులు ఇతర జీవరాసి శవాలుగా మారిపోతారు.

బహిర్వాయువు అంటే బయట ఉండే వాయువు. వాయువు యొక్క లక్షణం తనతో దేనినైనా తీసుకు వెడుతుంది. చూడండి బహిర్వాయువు దుర్గంధాన్నైనా, సుగంధాన్నైనా తీసుకు వెళుతుంది. అందుకే వాయువు దుర్గంధ

ప్రదేశాలలో వీచినపుడు, దుర్గంధాన్ని తీసుకు వెళ్ళడం వల్ల కంపు కొడుతుంది అంటే దుర్గంధ వాయువు వచ్చిందని లెఖ్క.

అలాగే వాయువు సుగంధ ప్రదేశాలలో వీచినపుడు అంటే మల్లెతోటలలో కానీ, సంపంగి తోటలలో కానీ, గులాబీ తోటలలో వీచినపుడు ఆ సుగంధాన్ని తనతో పాటు తీసుకు వెళుతుంది. అప్పుడు మంచి వాసన వస్తుంది. సుగంధ వాసన వస్తుంది. అందుకే వాయువు దుర్గందాలను కాని, సుగంధాలను కాని ఒకేరకంగా స్వీకరిస్తుందని తెలుసుకోవాలి.

అలాగే ఒక జ్ఞాని ద్వందాలలో అంటే మానావమానాలలో, శీతోష్ణాలలో, సుఖదుఃఖాలలో, గెలుపు ఓటములలో, నిందా స్తుతులలో సమానంగా వుంటాడు. ఇదే నేను వాయువు నుండి నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పడం జరిగింది.

## 5) ఆకాశం

ఆకాశం అంతటా వ్యాపించి వుంటుంది, ఎక్కడైతే కాళీ వుంటుందో అక్కడ ఆకాశమున్నట్టే. కానీ ఆకాశం యొక్క గొప్పతనం ఏమిటంటే? అంతటా ఉన్నా దేనినీ అంటించుకోదు.

చూడండి పరమాత్మ లేని ప్రదేశం లేదు. కానీ దొరుకుతాడా? అంటే దొరకడు, పట్టుకుందామంటే పట్టుకోలేరు ఆకాశం లాగ. అలా నేను ఆకాశాన్ని చూసి పరమాత్మ గురించి నేను తెలుసుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పడం జరిగింది.

దీనిని బట్టి దత్తాత్రేయులవారు ప్రతీదాన్ని ఎంత సూక్ష్మ దృష్టితో పరిశీలించారో తెలుసుకోవచ్చు. ఆయన. పంచభూతాలైన భూమిని, నీటిని, అగ్నిని, వాయువుని, ఆకాశాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఐదు రకాల పాఠాలు నేర్చుకున్నారు.

## 6) చంద్రుడు:

చంద్రుడి కళలు తగ్గుతూ ఉంటాయి, పెరుగుతూ ఉంటాయి. వాటినే అమావాస్య, పౌర్ణమి అంటారు. అలాగే ప్రతి జీవుడి శరీరము ముందు మెల్లిగా

పెరుగుతూ ఉంటుంది. తర్వాత నిర్వీర్యమై చంద్రకళల్లాగా మెల్లిమెల్లిగా కృశించిపోతుంది అంటే ఏదీ శాశ్వతం కాదు, సృష్టింపబడినది ప్రతీది నశించవలసిందే అన్నది నేను తెలుసుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పడం జరిగింది.

## 7) సూర్యుడు

సూర్యుడు అన్నిటికి వెలుతురు, వేడి ఇస్తాడు, నీటిని ఆవిరిగా మార్చి వర్షంగా కురిపిస్తాడు. అలా కురిపిస్తూ తానే కురిపిస్తున్నాను అనే అహంకారం చూపించడు, కతృత్వ భావం లేకుండా అంటే నేను చేస్తున్నాను అన్న భావం లేకుండా చేస్తున్నాడు.

వర్షం వస్తే ఎన్ని లాభాలు ఉన్నాయి చెప్పండి? అలాగే తన వెలుతురుతో, తన సూర్యకిరణాలతో ఎంతోమంది ఎన్నో పనులు చేసుకుంటారు. కానీ వీళ్ళందరి ఆనందానికి నేనే కారణం అని పొంగిపోడు. మంచి వాళ్లకి, చెడ్డ వాళ్లకి ఒకే రకంగా సమానంగా పంచుతాడు, సాక్షి భూతంగా చూస్తూ వుంటాడు.

అలాగే అందరికీ మేలు చేస్తూ.. నేను చేస్తున్నాను అనుకోకూడదు అని సూర్యుని నుంచి నేర్చుకున్నాను అని దత్తాత్రేయులు వారు చెప్పారు.

కొన్ని కుండల్లో నీళ్లు ఉన్నాయి. సూర్యుడు ఏ కుండలో అయినా ఒకేరకంగా కనిపిస్తాడు. కారణం ఉన్నది ఒకే సూర్యుడు కాబట్టి. అలాగే పరమాత్మ కూడా ఒక్కడే అయినా వేరు వేరు దేహాల్లో ఉండి వేరువేరుగా అనిపిస్తాడు.

అలా వేరు వేరుగా వున్నా అందరిలో వున్న పరమాత్మ ఒక్కడే! శరీరాలు వేరయినంత మాత్రాన పరమాత్మ విభజించబడలేదు అనే విషయాన్ని సూర్యుని చూసి మనం గ్రహించాలని దత్తాత్రేయులవారు తెలియ చేయడం జరిగింది.

మానవులు, జీవరాశులు సూర్య రశ్మి వల్ల ఎన్నో కార్యక్రమాలు జరుపుకుంటున్నా... నా వల్లే వీరంతా ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నారు అని ఎప్పుడూ అనుకోలేదు. సాధారణంగా ఎవరైనా ఏదైనా చిన్న పని చేసినా నేనే చేసానని ఎంతో గొప్పగా చెప్పుకుంటారు.

కానీ సూర్యుడు ఎప్పుడూ కూడా ఎన్ని పనులు జరుగుతున్నా సాక్షి స్థితిలో గమనిస్తున్నాడు కానీ నేను అనే కతృత్వం వుండదు. అలా సూర్యుని లాగే ఉండాలి అని నేను నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పడం జరిగింది.

# 8) ఏనుగు

ఏనుగుని పట్టుకోవాలి అంటే మావటివాడు  మంచె వేసి ఆడఏనుగు చేత అరిపిస్తాడు.  ఆ మగ ఏనుగు ఆడ ఏనుగు ఆరుపు విని రాగానే ఆ మంచెలో పడి చిక్కుకుపోతుంది, అపాయంలో పడిపోతుంది. అందుకే ఎప్పుడూ కూడా ఆడదాని వైపు కానీ, అందమైన స్త్రీవైపు కానీ ఆకర్షితులు కాకూడదు అని నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

శరీర స్పర్శ అనే ఆకర్షణకి ఏనుగు లోనయ్యింది. అందుకే చాలామంది చెప్తారు, పంచేంద్రియాలలో  శరీర స్పర్శ కోసం ఎందరో నాశనం అయినప్పుడు ఈ ఏనుగునే ఉపమానంగా తీసుకుంటారు. అందుకే మావటివాడు కూడా ఆడ ఏనుగు తోటి ఆరిపిస్తాడు.  ఆ మగ ఏనుగు గబగబా వచ్చి ఆ మంచెలో పడి మావటి వాడికి చిక్కుకుంటుంది.

అందుకే నేను భౌతిక ఆకర్షణలకు లోను కాకూడదు, నా జ్ఞానం పెరగదు అని గ్రహించాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

# 9) తేనెటీగ

తేనెటీగలు తేనెను తేనె పట్టులో ఎంత కూడ బెట్టినా, ఆ తేనెను తేనెటీగలు త్రాగవు,  అది ఇంకొకరి పాలవుతుంది. కష్టం ఒకరిదైతే అనుభవించేది మరొకరు.

అందుకే ధనం అన్నది ఎంత కూడా పెట్టినా వాళ్ళు ఉపయోగించుకోక పోతే! అంటే అవసరానికి మించి ఉన్న దానిని లోకులకు, లోక కళ్యాణానికి ఉపయోగించకపోతే ఆ ధనం ఇంకొకరి వశం అవుతుంది. అందుకే ధనం మీద, సంపదల మీద, భోగాల మీద ఆశ ఉండకూడదని, తేనెటీగలాంటి జీవితం కాకూడదని, తేనెటీగ నుంచి గ్రహించాను అని దత్తాత్రేయులవారు

చెప్పడం జరిగింది.

## 10) మిడత

మిడత దీపపు కాంతిని చూసి అది పండు అనుకుని దానికి ఆకర్షింపబడుతుంది. ఆ దీపం దగ్గరకు వెళ్లి ఆ దీపంలో పడి మరణిస్తుంది. అందుకే అందమైన, ఆకర్షణీయమైన వస్తువులను చూస్తూ అది కావాలి ఇది కావాలి అని తన్మయత్వంతో వాటి వెనకబడితే ప్రమాదంలో పడతాము అనే సత్యాన్ని నేను గ్రహించాను అని దత్తాత్రేయుల వారు చెప్పడం జరిగింది

## 11) సముద్రం:

సముద్రంలో నదులు వచ్చి కలుస్తాయి. కానీ ఎన్ని నదులు వచ్చి కలిసినా సముద్రం పొంగదు. వేసవికాలం వచ్చేటప్పటికి సముద్రంలో నీరు ఆవిరై మేఘాలుగా మారిపోతుంది. కానీ సముద్రం తరిగిపోదు. అంటే నదులొచ్చి కలిసాయని పొంగదు, ఎంత ఆవిరైనా తగ్గిపోదు. అలాగే ఏది వచ్చినా పొంగిపోకుండా, ఏదీ రాలేదని కుంగిపోకుండా వుండ గలగాలని సముద్రాన్ని చూసి నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

అంతేకాదు సముద్రం ఎన్నో రకాల జలచరాలకు ఆవాసంగా ఉపయోగ పడటమే కాదు వాటి మనుగడకు ఎంతో సహకరిస్తుంది. అలాగే ఎవరైనా ఇతరుల మనుగడకు సహకరించాలని సముద్రాన్ని చూసి నేర్చుకున్నాను అని దత్తాత్రేయుల వారు చెప్పారు.

## 12) కొండచిలువ

కొండచిలువ ఏది దొరికితే అది తింటుంది. ఏదీ దొరకకపోతే అది పస్తు ఉంటుంది తప్ప తిండి కోసం అది ఎప్పుడూ ప్రయత్నించదు. అది తన దగ్గరికి ఏ జంతువైనా వస్తే లటక్కుమని పట్టుకుంటుందట. అలా పట్టుకున్న జంతువును అరిగించుకునే శక్తి దానికి ఉంది. కానీ అది ఆహారం కోసం ప్రయత్నించదు.

అలాగే నేను కూడా దొరికిన వాటితో ఉంటాను, ఏదీ దొరక్కపోతే నిరాహారిగా ఉంటాను. కానీ ఆహారం కోసం ఎప్పుడూ ప్రయత్నించను. ఆహారం

దొరికితే స్వీకరిస్తాను. లేకపోతే వూరుకుంటాను అని కొండచిలువను చూసి నేను నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

## 13) లేడి

లేడి సంగీతం వింటే మైమరిచిపోతుంది. అందుచేత లేడిని పట్టడానికి బోయవాడు ఈల వేసి సంగీతం వినిపిస్తాడు. లేడీ సంగీతం విని మైమరిచిపోయి పరుగు పరుగున వచ్చి వలలో చిక్కుకొని, బోయవాడికి దొరికిపోతుంది.

లేడి లాగ సంగీత ధ్వనులు కానీ, నాట్యం కానీ, ఇలాంటి కళలు వున్నచోట మనం మనసు పెట్టకూడదు, అలాంటి వాటి మీద మనసు పెడితే వాటి ఆకర్షణకు లోనై పొదవలసిన జ్ఞానం నష్టపోయే ప్రమాదం వుంది అని తెలుసుకున్నాను. అందుచేత అలాంటి వాటి మీద దృష్టి పెడితే జన్మనే నష్టపోవలసి వస్తుందని తెలుసుకున్నానని దత్తాత్రేయుల వారు చెప్పారు.

చూడండి రుష్యశృంగుడు స్త్రీల మొహం తెలియకుండా పెరిగాడు. కానీ ఆ స్త్రీల వల్లే మళ్లీ సంసారంలో పడవలసి వచ్చింది. అందుచేత నేను అందమైన స్త్రీలు వైపుకానీ, సంగీతం, నాట్యాలు ఉన్న వైపు కానీ నేను వెళ్ళను, మనసు అటువైపు పెట్టను, నా కళ్ళు అటు తిప్పను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

## 14) వేశ్య

వేశ్య కూడా నాకు గురువే అన్నాడు దత్తాత్రేయులవారు. వేశ్య గురువేంటి! వేశ్య దగ్గర నేర్చుకునేదేమిటి? అని చాలామందికి అనుమానం వస్తుంది. వేశ్య కూడా ఆయనకి గురువే. ఎలాగంటే? ఒకసారి ఆయన వెళు తుంటే, పింగళా అనే వేశ్య తెల్లవార్లు విటుల కోసం ఎదురుచూసినా ఏ విటులూ రాలేదట. అప్పుడు ఆమె ఇలా అందట.

నేను విటుల కోసం ఎదురు చూశాను కానీ, ఆ విటుల కోసం ఎదురు చూసే బదులు, ఆ విశ్వేశ్వరుడి కోసం ఎదురు చూసుంటే నాకు ఎప్పుడో మోక్షం వచ్చుండేది అని ఆవిడ అన్న మాటలు ఈయన విన్నాడు.

అప్పుడు ఆయన అనుకున్నాడట ప్రపంచంలోని సుఖాల కోసం వెచ్చించే సమయం, ధనం విశ్వేశ్వరుడు కోసం వెచ్చిస్తే మోక్షమే వస్తుంది అని ఆ

వేశ్యను చూసి నేను నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

## 15) సర్పం

సర్పం ఎందులో తిరిగినా, ఎలా తిరిగినా అది శుభ్రంగా ఉంటుంది, శుచిగా ఉంటుంది. అది ఎప్పుడూ తనకి గూడు కట్టుకోవాలని అనుకోదు. బురదలోకి వెళ్ళినా సర్పానికి బురద అంటుకోదు.

అలాగే మనం కూడా ఏది అంటించుకోకుండా జీవించాలి. అంతేకాదు పాము ఎప్పుడు ఇల్లు నిర్మించుకోదు. అది చీమలు పెట్టిన గూడులోనే నివాసం ఏర్పాటు చేసుకుంటుంది.

అలాగే మనం కూడా మన కోసం ప్రయత్నించకుండా భగవంతుని మార్గంలో ఉంటే, ఆ భగవంతుడే ఏదో రూపేణ, ఏదో విధంగా మనకి ఇల్లు తయారు చేస్తాడు. నాకు ఇల్లు లేదే. ప్యాలెస్ లేదే అని భాధపడనక్కరలేదు. మన అర్హతను బట్టి మనకి వస్తుంది, మనం ఎప్పుడూ దాని కోసం ఆలోచించాల్సిన అవసరం లేదు అని తెలుసుకున్నానని దత్తాత్రేయుల వారు చెప్పారు.

గమనిస్తే ఇప్పుడు ప్రజలంతా కూడా ప్రపంచంలో కనపడే భోగభాగ్యాల వెనకాల పడుతున్నారు. కాని వాటిని పట్టుకుంటే మనకి దుఃఖం వస్తుంది. ఏదీ పట్టుకోకుండా వదిలితేనే ఆనందం ఉంటుంది.

దత్తాత్రేయులవారిని చూస్తే ఇది మనకి అర్థమవుతుంది. ఎందుకంటే? ఆయన తత్వాన్ని చూసినప్పుడు మన కోసం మనం ప్రయత్నించకుండా, సర్వేశ్వరుడి కోసం ప్రయత్నిస్తే రావలసినవన్నీ రానే వస్తాయి. ఇదే దత్తాత్రేయుల వారు నేర్చుకున్నది. ఇదే అయన నుంచి నేర్చుకోవలసింది.

## 16) పసిబిడ్డ

దత్తాత్రేయుల వారికి పసిబిడ్డ కూడా గురువే. ఎందుకు అంటే పసిబిడ్డ ఏ మాయా మర్మం మనసులో పెట్టుకోడు. పసి బిడ్డలో ఏ కల్మషం ఉండదు. అందుకే ఎప్పుడూ హాయిగా నవ్వుతూ ఉంటాడు. పసిబిడ్డకు అన్నీ ఒకటే! అందరూ ఒకటే! ఏ మాయా మర్మం వుండదు. ఎవరి మీద రాగద్వేషాలు

వుండవు. అందుకే పసిబిడ్డను దైవంతో పోలుస్తారు.

అందుచేత ఏ మాయ మర్మం మనసులో ఉంచుకోకుండా ఉండగలగాలి అని నేను పసిబిడ్డ నుంచి నేను తెలుసుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

# 17) చేప

చేప చూడండి నాలుక రుచికోసం చేపలు పట్టేవాడి ఎరలో చిక్కుకుని చచ్చిపోతుంది. అలాగే జిహ్వ చాపల్యానికి లోను కాకూడదు అని నేను నిర్ణయించు కున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

అలాగే మనం ఒక్కొక్క దాన్ని చూసి నేర్చు కుంటున్నప్పుడు, ఒక సాధకుడు ఎలా ఎదగాలి? ఏం అలవాటు చేసుకోవాలి? అనేవి అన్నీ కూడా చాలా చక్కగా మనకు అర్థమవుతాయి.

అందుచేత ఎలా ఉంటే యోగి అవుతాడు? ఎలా ఉంటే గొప్పవాడు అవుతాడు? అనేది తెలుసుకోవాలి. సహజంగా మానవుడు తానే గొప్పవాణ్ణి అని అనుకుంటే ఏమీ నేర్చుకోలేడు.

# 18) బోయవాడు

ఎవరైనా ఏదీ పట్టించుకోకుండా ఒక్కదాని మీదే దృష్టి పెట్టినప్పుడు అది తప్పకుండా సాధిస్తాడు. శ్రీకృష్ణుడు మరణించే ముందు ఒక టైంలో ఉద్ధవుడు వస్తాడు. వచ్చినప్పుడు నువ్వు వెళ్ళిపోతున్నావు కదా? నాకు కొంచం జ్ఞానం బోధించు అంటే? అప్పుడు శ్రీకృష్ణుడు చాలా విషయాలు చెబుతూ ఒక విషయం చెప్పాడు. నువ్వు , ఆత్మ జ్ఞానం పొందాలంటే, సాధన చేసేటప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉండాలని చెప్తూ, దానికి ఒక చిన్న ఉదాహరణ చెప్పాడు శ్రీకృష్ణుడు.

నీవు బయట నుంచి వచ్చేటప్పుడు ఎంతో దాహంతో ఇంటికి వస్తావు. ఇంటికి వచ్చినప్పుడు నీ భార్య ఎన్నో విషయాలు నీతో మాట్లాడుతూ ఉంటుంది. కాని నీ దృష్టి దేని మీద ఉంటుంది? నీ దృష్టి అంతా మంచినీళ్లు త్రాగడం మీదే ఉంటుంది. అందుచేత ఆవిడ చెప్పింది నువ్వు సరిగ్గా వినిపించుకోవు.

మంచినీళ్లు త్రాగాక నువ్వు మళ్ళీ అడుగుతావు? ఆ నువ్వు ఇందాక ఏదో చెప్పావు, నేను సరిగ్గా వినిపించుకోలేదు ఇప్పుడు చెప్పు, అని అడుగుతావు. ఎందుచేతనంటే? నీ భార్యచెప్పింది నువ్వు ఏకాగ్రతతో వినలేదు. అందుకే ఆవిడ చెప్పింది నీకు అర్థం కాలేదు. అందుచేత ఏకాగ్రత అంటే, ప్రక్కన ఏమి జరుగుతున్నా పట్టించుకోకుండా అనుకున్న దానిమీదే దృష్టి ఉంచగలగడం.

అందుచేత మన దృష్టి దేని మీదైనా నిశ్చలంగా ఉన్నప్పుడు మనకు ప్రక్కన ఏం జరుగుతున్నా వినిపించదు. కారణం మన దృష్టి దాని మీదే వుంటుంది కాబట్టి.

అలాగే బోయ వాడి దృష్టి బాణం తయారు చేయడం మీదే వుంటుంది. ఆలా ఉన్నప్పుడు ప్రక్కన ఎంతమంది వెళ్తున్నా, ఆఖరికి రాజుగారు వెళ్తున్నా పట్టించుకోడు.

అలాగే మనం ధ్యానం చేస్తున్నప్పుడు, జ్ఞానం వింటున్నప్పుడు, ధ్యానం గురించి చెప్తున్నప్పుడు అంత ఏకాగ్రత ఉండాలి. ఆ ఏకాగ్రత ధ్యానికి చాలా, చాలా అవసరం. అందుచేత నేను బోయవాడినుంచి ఏకాగ్రతను నేర్చుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

# 19) కందిరీగ

కందిరీగ మట్టితో గూడును కట్టి చిన్న కీటకాన్ని తీసుకొని వచ్చి, గూట్లో పెట్టి బయట కొన్ని రోజులు జుమ్మని శబ్దం చేస్తుంది. కీటకం ఆ ఝుంకార శబ్దం వింటూవుంటే తెలియకుండానే దాని శరీరం భ్రమరంగా మారిపోతుంది. ఆ చిన్న కీటకం కాస్త భ్రమరం లాగ మారి, ఆ గూడును పగలగొట్టుకొని ఎగురుకుంటూ బయటికి వస్తుందట.

ఇదంతా ఎందువల్ల జరిగింది? ఆ ఝుంకార నాద శబ్దం విని విని కీటకం కూడా చివరకు భ్రమరంలాగ తయారైపోతుంది. అలాగే నువ్వు ధ్యానంలో ఆ పరమాత్మతో ఉన్నప్పుడు, నువ్వే పరమాత్మగా మారిపోతావు. ఆ పరమాత్మ యొక్క సామీప్యనికి చేరుకుంటావు, అని దత్తాత్రేయులవారు కందిరీగను చూసి నేను తెలుసుకున్నాను అని చెప్పారు. దీనినే "భ్రమర కీటక న్యాయం అంటారు".

# 20) సాలీడు

సాలీడు ఏం చేస్తుంది తన చుట్టూ గూడుని అల్లుకుంటుంది. దాని నోట్లో నుంచి ఒక ద్రవం వస్తుంది. ఆ ద్రవంతో గూడు అల్లుతుంది. చివరకు అదంతా తానే లోపలకి తీసుకుంటుందట.

సాలీడు లాగే పరమాత్మ నుంచి వచ్చిన ఈ సృష్టి అంతా కూడా ఆయనలోనే లయం అవుతుందని నేను తెలుసుకున్నాను అని దత్తాత్రేయులవారు చెప్పారు.

ఆయన ఇంకా జ్ఞానపరంగా సాధకుడు ఎలా ఉండాలి? ఎలా వుంటే జీవుడు దేవుడు అవుతాడు, ఇవన్నీ నేను తెలుసుకున్నానని యదు మహారాజుతో చెప్పారు. ఆయన ఇంకా ఇవే కాకుండా నా శరీరాన్ని చూసుకుంటూ, నా నుంచి కూడా నేను ఎంతో నేర్చుకున్నాను అన్నారు.

# 21) తేనెపట్టు తీసేవాడు

తేనెపట్టు తీసేవాని నుంచి నేర్చుకున్నదేమిటంటే సద్వినియోగము చెయ్యక, దాచి పెట్టబడిన ధనము దొంగలను ఆకర్షించి ప్రమాదాన్ని తెచ్చి పెడుతుంది. కనుక సంగ్రహణ శక్తిని, లోభ ప్రవృత్తినీ దరిచేరనివ్వరాదని తెలుసుకున్నానని దత్తాత్రేయుల వారు తెలిపారు.

# 22) పావురము

ఒక పావురము ఒక చెట్టుపై గూడు కట్టుకుని ఆడ పావురాన్ని జత చేసుకుంది. రెండు పక్షులు అన్యోన్యంగా జీవించసాగాయి. అవి గుడ్లు పెట్టి పొదిగి పిల్లల్ని పెంచసాగాయి. ఆ పిల్లల కోసం అవి రోజంతా శ్రమించి ఆహారం తెచ్చి వాటిని పోషించి పెద్ద చేశాయి. పక్షి పిల్లలు ఆ చెట్టు కిందకి వచ్చి ఆడుకుంటూ ఒక బోయవాని వలలో చిక్కుకున్నాయి. పిల్లల్ని విడిపించ బోయి ఆడపక్షి కూడా బోయవాని వలలో చిక్కుకుంది. మగపావురం వచ్చి గూడులో భార్య, పిల్లలు లేకపోవడం చూసి వాటి వియోగ బాధను భరించలేక తాను కూడా వలలో చిక్కుకుంది. పరివారాన్ని విడిచి వెళ్ళలేక, వాటిని

విడిపించాలని ప్రయత్నించి తాను కూడా వలలో చిక్కుకుంది. అప్పుడు ఆ పావురం ఇలా విలపించింది. పుట్టినప్పటి నుంచి స్వేచ్ఛా విహారినైన నేను స్త్రీ వ్యామోహంలో పడి ఈ వలలో చిక్కుకున్నాను. ఇప్పుడు నన్ను రక్షించేది ఎవరు? అని అనుకుంది.

ఈ పావురముల నుంచి దత్తాత్రేయుల వారు నేర్చుకున్నదేమిటంటే ? మానవుడు భార్యా బిడ్డలయందు మమకారాన్ని పెంచుకుంటే సంసారమనే వలలో చిక్కుకుని తన జీవితలక్ష్యమైన మోక్ష సాధనను మరచిపోతాము అని నేర్చుకున్నాను అని చెప్పారు. అందుచేత అలా చెయ్యకూడదని తెలుసుకున్నాను అని చెప్పడం జరిగింది.

## 23) కురరము

కురరము అనే పక్షి కొన్ని మాంసపు ముక్కలను తెచ్చుకొని గూటిలో దాచుకుంది. వాటిని కాపాడుకోవటానికి నిద్రాహారాలను మాని కాపలా కాసేది. ఒక రోజు ఆ చెట్టుపైనున్న ఇతర పక్షులు ఆహారము దొరకక ఆ కురరము గూటిలో దూరి దానితో పోట్లాడి దాని మాంసపు ముక్కలు తీసుకునిపోయాయి. అప్పటి నుంచి ఆ కురరము నిశ్చింతగా వుండసాగింది. లభించినదే తింటూ ఏమీ దాచుకోకుండా పరమ శాంతిని పొందింది. దీనిని బట్టి దత్తాత్రేయుల వారు ఏమి నేర్చుకున్నారంటే? సంగ్రహించుకొని దాచుకోవడం దుఃఖహేతువు కనుక నాది అంటూ ఏమీ లేకపోతే నేను పరమ సుఖంగాను, సంతోషంగాను ఉండగలనని తెలుసుకున్నాను అని దత్తాత్రేయుల వారు చెప్పడం జరిగింది.

## 24) కన్య

ఒక కన్య తల్లిదండ్రులు వేరే గ్రామానికి వెళ్ళారు. ఆ సమయంలో అతిధులు వచ్చారు. వంటకు బియ్యం సిద్ధంగా లేనందున ఆమె కొంచెము ధాన్యము దంచవలసి వచ్చినది. వారు ధ్యానం చేసుకుంటున్నారు. పరిస్థితి అతిధులు తెలుసుకోరాదని పెరటిలో ధాన్యము దంచగా గాజుల శబ్దము

వినిపించరాదని రెండే గాజులు వుంచుకుని మిగిలినవి తీసి వేసింది. ఆమె ప్రశాంతంగా పని ముగించుకుంది.

ఈమె నుండి దత్తాత్రేయుల వారు నేర్చుకున్నది ఏమిటంటే? ధ్యానము చేసేటప్పుడు ఎటువంటి శబ్దాలు వుండకూడదని తెలుసుకున్నాను. ఏకాంతమే, నిశ్శబ్దమే ధ్యాన సిద్ధికి మార్గమని తెలుసుకున్నాను అని దత్తాత్రేయుల వారు చెప్పడం జరిగింది.

## వృక్షాలు

అంతే కాదు నేను వృక్షాల నుండి కూడా ఎంతో నేర్చుకున్నాను అని చెప్పారు.

వృక్షాలు లేకపోతే ఈ సృష్టిలో 84 లక్షల జీవరాశులకి ఆహారమే వుండదు. అలా చూస్తే చెరువులో నాచు కూడా చేపలకి ఆహారం. అలా అందరికీ ఆహారం ఇవ్వడం, బ్రతుకు నివ్వడం వృక్ష జాతి లక్షణం. అలా వృక్షజాతి లోకానికి ఎంతో ఉపయోగపడుతుంది.

అంతేకాదు చెట్టు ఎండిపోయినా ఆ కట్టెలు కూడా మానవులకు పొయ్యిలోనికి ఉపయోగపడతాయి. అంతేకాదు వృక్షాల యొక్క కలప మానవులు ద్వారాలకు, కిటికీలకు, బీరువాలకు ఎన్నో రకాలుగా ఉపయోగించు కుంటున్నారు. అలా మానవుడు కూడా లోకానికి ఉపయోగపడాలని నేను నేర్చుకున్నానని దత్తాత్రేయుల వారు తెలిపారు. అంటే ఒక చెట్టు బ్రతికి వున్నా, చనిపోయినా జీవ జాతికి ఏదో ఒకటి ఇచ్చి ఉపయోగపడుతుంది.

అంతేకాదు మానవులు, జంతువులు వదిలిన కార్బన్డయాక్సైడ్ తీసుకుని ఆ జీవులకు ఉపయోగపడే ఆక్సిజన్‌ను వృక్షాలు ఇస్తున్నాయి. అంటే మానవులకు ఉపయోగ పడని కార్బన్డయాక్సైడ్ తీసుకుని ఆక్సిజన్ గా మార్చి మళ్ళీ మానవులకు, జీవులకు వృక్షజాతి ఇస్తుంది.

అంతేకాదు వృక్షాలు అన్ని రకాల జీవులకు నీడను ఇస్తాయి. ఆ నీడలో మానవులు, ఎన్నో రకాల జంతువులు ఎంతో సేదతీరతాయి, విశ్రాంతి తీసుకుంటాయి. అంతేకాదు చెట్లు, వృక్షాలు ఎన్నో రకాల పక్షులకు ఆవాసంగా

ఉపయోగపడుతున్నాయి.

మానవులు రాళ్ళతో కొట్టినా, నరికినా ఏమీ బాధపడవు. అందరికీ ఉపయోగపడుతున్నానని ఆత్మార్పణ చేసుకుంటాయి. అలా వృక్షాల నుంచి, చెట్ల నుంచి ఎన్నో నేర్చుకున్నానని దత్తాత్రేయుల వారు చెప్పారు.

అలాగే దత్తాత్రేయుల వారు ప్రకృతి నుంచి అంతులేని జ్ఞానం సంపాదించుకున్నారు, ఆయన భూమిమీద సంచరించినప్పుడే కాదు, లేనప్పుడు కూడా ఆయన జ్ఞానం ఎంతో మందికి ఉపయోగపడుతుంది.

దత్తాత్రేయుల వారు కూడా వృక్షాలులా జీవించి వున్నప్పుడే కాదు చనిపోయిన తరువాత కూడా ఉపయోగపడుతున్నారు.

అలా ప్రతీదీ ప్రకృతి నుంచి నేర్చుకోవడం అన్నది దత్తాత్రేయుల వారి నుంచి మనందరం నేర్చుకోవచ్చు. అందుకే మన ఋషులు ఏం చెప్పారు అంటే? ప్రకృతిని చూసి పాఠాలు నేర్చుకోవాలి అన్నారు.

అంతేకాదు వృక్షాలు ఎదుగుతూ మెల్లిగా పూలు, కాయలు, పళ్ళు ఇస్తుంది. ఆ పళ్ళనుంచి విత్తనాలు వస్తాయి. అవి భూమిలో పడి మళ్లీ వృక్షాలుగా తయారవు తున్నాయి.

అలాగే జీవుడు అంటే మానవుడు శరీరంతో సాధన చేసి పరమాత్మను చేరుకోవాలనే ఆశయంతో భూమి మీధికి వస్తాడు.  కాని వచ్చిన తరువాత తాను భూమ్మీదికి ఎందుకు వచ్చాడో తెలుసుకోకుండా, ఏ పని చేయడానికి వచ్చాడో తెలుసు కోకుండా.. వచ్చిన పని మర్చిపోయి బంధాలకు లోనౌతున్నాడు.

బంధాలు అంటే ఇంద్రియ సుఖాలకు, శరీరానికి, భార్య పిల్లలకి, సంసారానికి, సంఘానికి విలువఇచ్చి, వారికోసం ఎన్నో కర్మలు చేస్తూ, ఆ కర్మ ఫలాలు అనుభవించడానికి మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకుంటున్నాడు, మళ్ళీ కర్మలు చేస్తున్నాడు. అలా జన్మలు తీసుకుంటూ రావడం పోవడం, అంటే "పునరపి జననం" "పునరపి మరణం"గా జరుగుతుంది.

ఇవన్నీ చూస్తున్నప్పుడు నాకేమనిపించింది అంటే? మానవుడు శరీరాన్ని తీసుకుని, ఇన్ని పాట్లు పడేకంటే! శరీరం ఉండగానే  పరమేశ్వరుని అంటే

భగవంతుని తెలుసుకుంటే?  మోక్షమే పొందవచ్చుకదా? అంటే శరీరం రాకుండా చేసుకోవచ్చు కదా? అని తెలుసుకున్నాను.

## శరీరం

అంతేకాదు దత్తాత్రేయుల వారు శరీరం నుంచి కూడా నేర్చుకున్నాను అని చెప్పారు.

ఈ శరీరం అనిత్యం, అశాశ్వతం.  పంచభూతాలతో తయారైన ఈ శరీరం చనిపోయాక కాలి బూడిద అవుతుంది. లేదా ఏ క్రిమి కీటకాలో దీన్ని ఆహారంగా చేసుకుంటాయి. అలాగే క్రిమి కీటకాలు కూడా కొన్నిటికి ఆహారం అవుతాయి.  అలాగే ఈ సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు. సృష్టించబడినవన్నీ నశించిపోయేవే అని శరీరంనుంచి నేను తెలుసుకున్నాను అని దత్తాత్రేయుల వారు చెప్పడం జరిగింది.

భగవంతుడు ఎన్నో  జీవుల్ని సృష్టించి, తృప్తి చెందక ఆఖరిలో  మానవ శరీరం సృష్టించాడు. కాని ఇతర జీవులకి బుద్ధి అనేది లేకపోవడం చేత, పరమాత్మని తెలుసుకోలేవు. కానీ మానవ శరీరం వున్న మానవునకు  తనను తాను తెలుసుకోవడానికి బుద్ధి ప్రసాదించబడింది. ఈ బుద్ధి వల్లే మానవుడు పరమాత్మను తెలుసుకో గలుగుతున్నాడు. అందుచేత మానవ శరీరం యొక్క గొప్పతనం తెలుసుకున్నాను అని దత్తాత్రేయుల వారు చెప్పారు.

అందుకే తెలివైన వాడు ఈ శరీరంతో సాధన చేసి,  జ్ఞానం పొంది ఆ పరమాత్మని తెలుసుకోవాలి అని నేను తెలుసుకున్నాను. కానీ చాలామంది ఇప్పుడే మోక్షం ఎందుకు? అనుకుంటారు. వారికి ధ్యానం చిన్నప్పుడే చేస్తే మంచిది అని చెప్పినా, ఇప్పటినుంచే  ఎందుకు?  ఇంకా చాలా టైం వుంది కదా అంటారు.  కాని ధ్యానం చిన్నతనంలోనే తెలుసుకోవాలి, చిన్నతనం నుంచే ధ్యానం నేర్చుకుంటే వాళ్ల ప్రవర్తన బాగుంటుంది, ఎంతో జ్ఞానం నేర్చుకుంటారు.

అందుచేత ఎవ్వరైనా సరే ఈ భూమ్మీద శరీరం ఉండగానే తెలుసు కోవడానికి ప్రయత్నం చేస్తే! ఇక జన్మలేని మోక్షస్థితి పొందవచ్చు. ఇది తెలుసుకున్న వాళ్లు చాలా ధన్యులు.

అందుచేత పెద్దల నుంచి, యోగులనుంచే కాదు, ప్రకృతి నుంచి కూడా దత్తాత్రేయుల వారిలాగే నేర్చుకుంటూ ఉండాలి. అందుకే పత్రిగారు ప్రతి వాళ్ళ నుంచి నేర్చుకోవాలని చెబుతూ ఉంటారు.

మరి ఎందుకు నేర్చుకోలేకపోతున్నారు? అంటే అజ్ఞానము, అహంకారమే కారణం. వాళ్ల దగ్గర నుంచి నేర్చుకోవడం ఏమిటి? నాకే అన్నీ తెలుసు అనే అహంకారం. అంతేకాదు భార్యా పిల్లల మీద, ధనం మీద మమకారం వుండడం వల్ల ధన సంపాదన మీద, భార్య పిల్లల మీద దృష్టి వుంచడానికే సమయాన్నంతా వెచ్చించడం వల్ల కూడా జ్ఞానం నేర్చుకోలేక పోతున్నారు.

మనసు ఎంత డబ్బు ఉంటే, ఎన్ని పదవులు ఉంటే అంత గొప్ప అనుకుంటుంది. అంతేకాదు ప్రాపంచిక చదువులు చాలా గొప్పవని, వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఆధ్యాత్మిక విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారు.

## రమణ మహర్షి

రమణ మహర్షివారిని చూడండి, ఆయన ఏ చదువు చదువుకోలేదు. కాని ఆ పరమాత్మ గురించి తెలుసుకునే చదువే చదువుకున్నాడు. అదే పరావిద్య అంటే పరమాత్మ గురించిన విద్య అంటే ఆత్మవిద్య తెలుసు కున్నాడు.

పరమాత్మను చేరాలంటే ఈ శరీరంతో, ప్రాపంచిక డిగ్రీలు సంపాదిస్తే సాధ్యం కాదు. ఎవరైతే ధ్యాన సాధన చేస్తారో! ఆత్మ విద్య అభ్యసిస్తారో! వారికే ఇది సాధ్యం. అందుచేత ఉన్నదానితో తృప్తి పడుతూ, ఇతర జీవుల హింసించకుండా జీవించాలి.

పక్షులను, జంతువులను, చేపలను చంపి తినడం కాదు. అవి కూడా బ్రతకడానికే భూమిమీదకు వచ్చాయి. అందుచేత సశ్యాలు, కాయగూరలు, పండ్లతో తృప్తి పడాలి.

## సృష్టికర్త సహాయం

సృష్టికర్త మానవుల్ని సృష్టించక ముందే మానవులకు కావాల్సిన ఆహారాన్ని అంతా సృష్టిలో సిద్ధం చేసి ఉంచాడు. ఎవరినీ పస్తు వుంచడు.

ఒకసారి వివేకానందుడు ఒక వూరు వెళ్ళినప్పుడు ట్రైన్ దిగేటప్పటికీ రాత్రి పది అయింది.

ఆయన బాగా ఆకలితో వున్నాడు. ఇంత రాత్రి 10 గంటలకు ఎవరి ఇంటికి వెళ్లాలి? ఎవరూ నాకు తెలియదు కదా? అని రైల్వేస్టేషన్ లోని సిమెంటు సోఫాలో కూర్చొని ధ్యానం చేసుకుంటూ ఉన్నాడు. అప్పుడు ఆ స్టేషన్ మాస్టర్ ఒక లాంతరుతో భోజనం పట్టుకుని వచ్చాడు.

అప్పుడు వివేకానందుడు నేను పస్తు ఉన్నానని మీకు ఎలా తెలుసు? మీరు నన్ను ఇక్కడికి వెతుక్కుంటూ వచ్చారేమిటి? అని స్టేషన్ మాస్టారిని అడిగాడు.

అప్పుడు ఆయన నేను పడుకున్నప్పుడు రాముడు కలలోకి వచ్చి, అక్కడ స్టేషన్లో ఒక యోగి ధ్యానంలో కూర్చున్నాడు, ఆకలితో ఉన్నాడు, భోజనం తీసుకెళ్లి ఆయనకు పెట్టు అని చెప్పాడట. అందుకని నేను భోజనము తీసుకొని వచ్చానండి అన్నాడు.

ఇక్కడ గుర్తుంచుకోవలసింది, ఒక యోగి భోజనం చేయకుండా వుంటే పరమాత్మ ఏదో ఒక రూపంలో ఆ భోజనం అందించడం జరుగుతుంది.

అందుచేత తెలుసుకోండి భగవంతుని మార్గంలోకి వచ్చినవారు ప్రకృతిని గౌరవిస్తూ, పరమాత్మ మీద నమ్మకంతో ఉంటే వారికి ఏ లోటు ఉండదు.

సహజంగా అందరూ ఏమనుకుంటారంటే వ్యాపారం మానేస్తే, ఈ ఉద్యోగం మానేస్తే ఎలా బ్రతుకుతాం? అని అనుకుంటారు. కానీ ఏమీ అవ్వదు ధర్మంగా సంపాదించి పదిమందికి పెడుతూ, తాను తింటే వారికి ఏ లోటూ వుండదు.

అందుచేత ధ్యానం చేసే యోగి ఎప్పుడు త్రికరణశుద్ధిగా సాధన చేస్తూ, ధ్యానమార్గంలో ఉంటే ప్రకృతి ఎప్పుడూ పస్తు ఉండనివ్వదు. ఏదో రకంగా కావలసినవి సమకూరుస్తుంది.

## స్వామి రామతీర్థ

అలాగే స్వామి రామతీర్థ జీవితంలో కూడా ఒక సంఘటన జరిగింది. రామతీర్థ పెద్ద ప్రొఫెసర్. ఆయన అమెరికా కూడా వెళ్ళి తిరిగి ఇండియాకు వచ్చాడు. రామతీర్థ వచ్చిన జీతాన్ని లోకుల కోసం బయట ఖర్చు పెట్టేవాడు. భార్య ఆయనతో వచ్చిన జీతం అంతా ఖర్చు పెడితే, రేపు పిల్లల పరిస్థితి

ఏమిటి? అని అడిగేది. ఆయన ఒక మాట అనేవారు. **"విశ్వం కోసం మనం పాటుపడితే విశ్వేశ్వరుడు నా పిల్లలని చూసుకోడా?"** అని అనేవాడట. ఆయన పిల్లలు తర్వాత పెద్ద పెద్ద పొజిషన్లో ఉన్నారట.

విశ్వం కోసం పనిచేస్తే విశ్వేశ్వరుడు మనల్ని, మన కుటుంబాన్ని చక్కగా చూసుకుంటాడు అని తెలియడానికి మీకు ఈ విషయం చెప్పడం జరిగింది.

రామతీర్థ జీవితంలో జరిగింది ఇంకొకటి కూడా వుంది. ఆయనకు 40 సంవత్సరాలు వచ్చినప్పుడు ఆయనకు వైరాగ్యం వచ్చింది. హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుని శేష జీవితం గడపాలని అన్నీ అమ్మేసి పిల్లలకు, భార్యకి చేయాల్సిన ఏర్పాట్లు చేసి, కొంత డబ్బు తీసుకొని హిమాలయాలకు వెళ్లాడు. గంగా నది దాటి ఆవలి ఒడ్డుకివెళ్లి అక్కడ ధ్యానం చేసుకుందామనుకుంటే, ఆయనకు ఒక ఆలోచన వచ్చిందంట. అవును భగవంతుని కోసం నేను ధ్యానం చేస్తున్నాను కదా? ఈ డబ్బు నా కోసం ఎందుకు దాచుకోవాలి, ఈ డబ్బు కూడా లేకపోతే ఇంకా మంచిది కదా? అని బట్టలు, సామాను అన్నీ వున్న మూటను గంగా నదిలో విసిరేశాడు. వెళ్లి ధ్యానంలో కూర్చున్నాడు. అప్పుడు ఆయన దగ్గర ఏమీ లేదు కట్టుకున్న పంచ ఒకటే ఉంది.

హిమాలయాలకు చుట్టుపక్కల చిన్న చిన్న పరగణాలు ఉండేవి. ఒకాయన, రామతీర్థ దగ్గరికి వచ్చి, తినుబండారాలు అక్కడ పెట్టి ప్రక్కన కూర్చున్నాడు. రామతీర్థ కళ్ళు విప్పగానే ఆయన పలకరించాడు, స్వామి క్షేమమేనా అని.

అప్పుడు రామతీర్థ నేను ఇక్కడ ఉన్నట్టు మీకు ఎలా తెలుసు? ఇక్కడికి ఎందుకు వచ్చారు? అని ఆయనను అడిగారు.

బండిలో వచ్చిన ఆయన చిన్న జమిందారు. ఆయన చెప్పాడు, రాత్రి రాములవారు నాకు కలలో కనిపించి గంగా నది ఒడ్డున ఒక అతను సాధన చేసుకుంటూ ఉన్నాడు. ఆయన దగ్గర ఉన్న ధనాన్ని కూడా గంగా నదిలో వేసేసాడు. పరమాత్మే చూసుకుంటాడు అనే నమ్మకంతో కూర్చున్నాడు.

కాబట్టి నువ్వొకసారి వెళ్లి ఆయనను కలువు అని చెప్తే, నేను వచ్చాను స్వామి అని చెప్తాడు. ఈరోజు నుంచి మీ సాధన మీరు చేసుకోండి చక్కగా రోజు మీకు కావాల్సిన భోజనాన్ని రెండు పూటలా నేనే పంపిస్తాను. మీరు

ఎన్నాళ్ళైనా సాధన చేసుకోండి అన్నాడట.

చూశారా ఈ రెండు సంఘటనలు చూస్తే మనకేం అర్థం అవుతుంది. మనం అన్ని సంశయాలు వదిలి యోగ మార్గంలో ఉండి, జ్ఞానం పెంచుకుంటూ ఆ పరమాత్మ మీద నమ్మకంతో ఉన్నప్పుడు ప్రకృతి ద్వారా మన యోగక్షేమాలు చూడడానికి పరమాత్మ ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు అని తెలుసుకోవాలి.

ఈ విషయమే భగవద్గీతలో 9 అధ్యాయం 22 శ్లోకంలో శ్రీ కృష్ణుల వారు ఏమి చెప్పారంటే?

**శ్లో॥ అనన్యాశ్చింతయన్తోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమ వహామ్యహమ్ (భ.గీ.9-22)**

తా:- ఎవరైతే ఇతర చింతలు లేకుండా నన్నే నమ్ముకుని, నన్నే ధ్యానిస్తూ, ఎల్లప్పుడూ నాయందే నిష్ఠ కలవారి యొక్క యోగక్షేమాలను నేనే చూసుకుంటాను అన్నారు.

## రాముడు లక్ష్మణునకు ఇచ్చిన సలహా

రాముడికి రావణుడికి యుద్ధంజరిగేటప్పుడు... రాముడు లక్ష్మణున్ని యుద్ధనీతి అంటే ఏమిటో? రావణాసురుడి దగ్గరికి వెళ్లి నేర్చుకొనిరా అని చెప్పడం జరిగింది.

అప్పుడు లక్ష్మణుడు అడుగుతాడు అన్నయ్యా రావణాసురుడు మన శత్రువు కదా? ఆయన దగ్గరకు నన్ను పంపిస్తున్నావేమి అని అడిగితే! అప్పుడు రాముడు లేదు ఆయన అధర్మంగా ఏమీ వుండడు, యుద్ధ నీతి చెప్తాడు! వెళ్ళు అన్నాడు.

అప్పుడు రావణాసురుడు యుద్ధం అంటే ఏమిటి ?యుద్ధం ఎలా మొదలు పెట్టాలి? ఎలా చేయాలి? అన్న నీతి అంతా లక్ష్మణునకు చాలా చక్కగా చెప్పాడు.

ఎందుకంటే రావణాసురుడు నాలుగు వేదాలు చదివాడు, అన్నీ తెలుసు. కానీ కామం అనేది వదులుకోలేక, తప్పని తెలిసినా ప్రెస్టేజ్ కోసం యుద్ధం చేయాల్సి వచ్చింది.

## బుద్ధుడు ఏమన్నాడంటే?

బుద్ధుడు ఒక మాట చెప్తాడు. నీకు ఒక వ్యక్తి పరిచయం అయ్యాడంటే? ఆయన నుంచి నీకు ఏదో అవసరమైనప్పుడే, అతని నుంచి నువ్వు ఏదో

నేర్చుకోవాల్సి ఉన్నప్పుడే నీకు ఆ వ్యక్తి ఎదురవుతాడు. నీకు ఏదో పాఠాలు నేర్పించడానికే ఆ సంఘటన నీ జీవితంలో జరుగుతుందని తెలుసుకోవాలి.

అంటే మనకి ఇప్పుడు ఒక వ్యక్తి ఎదురయ్యాడు, అంటే ప్రకృతి మన ముందు నిలబెట్టింది అంటే ఆ వ్యక్తి నుంచి మనమేదో నేర్చుకోవాల్సిన పాఠం ఉందని అర్థం. కారణం అందరిలో మంచి గుణాలు ఉండవు, అందరిలో చెడు గుణాలూ ఉండవు. అందుచేత ఎవరి నుంచి ఏమి నేర్చుకోవాలో అన్నది తరువాత తెలుస్తుంది. అందుకే మనమంతా పత్రిగారికి ఆకర్షితులమయ్యాము.

అలాగే బుద్ధుడు ఏమన్నాడంటే! ప్రతి వ్యక్తి గొప్పవాడు అవుతాడు. చెడ్డవాడైన వారిలో కూడా ఏదో గొప్పతనం ఉంటుంది. కాబట్టి ఆ గొప్పతనం ఏదో నీవు నేర్చుకోవాలని అంటాడు. ఎదుటి వ్యక్తిలో 99 తప్పులు వున్నా ఒక మంచి ఉంటే ఆ మంచిని నువ్వు నేర్చుకోవడానికి ప్రయత్నించు అంటాడు బుద్ధుడు. నీలో 99 మంచి ఉండి ఒక తప్పు ఉంటే ఆ తప్పుని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించు అంటాడు.

అలాగే మన ఎదురుగా ఉన్న వ్యక్తి నుంచి నేర్చుకోవాలి, మనకు ఎదురయ్యే సంఘటనల నుంచి కూడా నేర్చుకోవాలి, ప్రకృతి నుంచి నేర్చుకోవాలి, మహాత్ముల నుంచి నేర్చుకోవాలి, ఎన్నో పుస్తకాలు నుంచి నేర్చుకోవాలి.

## ధ్యాని ఏమి చెయ్యాలి?

ఒక దత్తాత్రేయుడుగా తయారవ్వాలంటే ఎంతో మందిని గురువులుగా ఎంచుకొని సూక్ష్మాతి సూక్ష్మంగా గ్రహించాలి. ఒక చిన్న కందిరీగ, ఒక పాము, పంచభూతాలు ఆలా ఎన్నిటి నుంచో నేర్చుకున్నాడు దత్తాత్రేయుడు. మనం ఇవన్నీ పట్టించుకోము, కానీ దత్తాత్రేయుడు వీటి నుంచే ఎంతో జ్ఞానం నేర్చుకున్నాడు.

ధ్యానులు ఎప్పుడూ ఒక మాట గుర్తుంచుకోవాలి. ఏమిటంటే? మనమంతా ఈ భూమ్మీదికి సత్యాన్వేషణకై వచ్చిన నిరంతర విద్యార్థులం. నీకు సత్య దర్శనం అయ్యేంత వరకు నువ్వు విద్యార్థివే కానీ, మాస్టర్ కావు. నేను విద్యార్థి అనుకుంటూ నువ్వు వినయంగా ఉన్నప్పుడు నీకు పాఠాలన్నీ వస్తూ ఉంటాయి.

నీకు నేర్పించడానికి ప్రకృతి ఎప్పుడు సిద్ధంగా ఉంటుంది. ఒక పుస్తకం ద్వారానో, ఒక ఫ్రెండ్ ద్వారానో, ఒక గురు ద్వారానో, ఇలా క్లాసులు ద్వారానో, నీవు నేర్చుకోవాల్సిన విషయాలు చాలా నేర్పబడుతూ ఉంటాయి. ఎప్పుడూ కూడా మనం నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. మనం ఎప్పుడూ విద్యార్థులమే.

ఈ భూమి మీద మానవ దేహం తీసుకున్నాము అంటే మనం సత్యాన్వేషణకు వచ్చినట్లే. మానవ జన్మ వచ్చిన వెంటనే కూడా చాలామంది ఈ సత్యాన్వేషణ చేయలేరు. ఎందుకంటే? కొన్ని జన్మలు తమోగుణంలో, కొన్ని జన్మల రజోగుణంలో, కొన్ని జన్మల సాత్వికగుణంలో ఉంటారు.

ఈ మూడు గుణాలతో తీసుకున్న జన్మలలో కర్మలు పెరుగుతాయి అంటే తమోగుణం, రజోగుణాలలో పాపకర్మలు ఎక్కువగా చేస్తారు. సాత్విక గుణంలో పుణ్యకర్మలు చేస్తారు. ఈ కర్మలన్నీ మనకు బంధాలౌతాయి. ఈ బంధాలన్నీ మరుజన్మకు కారణమవుతాయి. అందుచేత ఈ మూడు గుణాలు వదలాలి. ఈ విషయమే భగవద్గీతలో శ్రీకృష్ణుల వారు చెప్పడం జరిగింది.

**శ్లో॥ త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున**
**నిర్ద్వన్ద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ (భ.గీ. 2-45)**

తా:- ఓ అర్జునా వేదాలు త్రిగుణాత్మకములగు సంసార విషయాలను తెలుపుచున్నాయి. నీవు త్రిగుణములను వదిలిన వాడవుగాను, ద్వంద్వములు లేనివాడవుగాను, నిరంతరము శుద్ధసత్వమును ఆశ్రయించిన వాడవుగా, యోగక్షేమముల దృష్టి లేని వాడగుము, ఆత్మజ్ఞానివి కమ్ము.

అంటే ఈ మూడు గుణాల్ని దాటి వెళ్లాలన్నారు. వేదాలు మూడు గుణాలు వరకూ చెప్పాయి. అంటే ప్రకృతి దేవతలను ఆరాధించడం, దానికి కావలసిన మంత్రాలు, స్వర్గ సౌఖ్యాల గురించి కావాల్సిన మంత్రాలు, ఇవన్నీ ఉన్నాయి, ఎక్కడో కొద్దిగా జ్ఞానం ఇవ్వడం జరిగింది.

అంటే ఈ మూడు గుణాలతో చేసే పనులే వేదం చెప్పింది. ఈ మూడు గుణాలు దాటి నిర్గుణ స్థితికి వెళ్తే గాని నీవు నేనున్న లోకానికి రాలేవు అని చెప్పడం జరిగింది.

అంటే ఇప్పుడున్న పిరమిడ్ మాస్టర్స్ అందరూ కూడా శుద్ధ సాత్విక గుణంలో ఉన్నవారు కాబట్టే ధ్యానం, జ్ఞానం రెండు పట్టుకున్నారు. అందుకే ప్రతిగారు పిరమిడ్ మాస్టర్స్ మామూలు వ్యక్తులు కాదు అంటారు. వారు చూడడానికి చాలా సాదాసీదాగా కనిపిస్తారు, సామాన్య వ్యక్తులుగా కనిపిస్తారు కానీ చాలా గొప్ప వాళ్లు.

అందుకే ధ్యానం చేస్తారు, ధ్యానం చెప్తారు. అందరూ బాగుండాలని కోరుకుంటారు. అన్ని జీవులూ క్షేమంగా ఉండాలని కోరుకుంటూ శాకాహారాన్ని పాటిస్తారు.

ఒకప్పుడు వేల సంవత్సరాలు ధ్యానం చేస్తే గానీ దొరకని జ్ఞానం పత్రి గారి వల్ల ఈ రోజుల్లో చాలా తేలికగా దొరుకుతుంది. అందరూ కూడా ఎంతో తొందరగా నేర్చుకోగలుగుతున్నారు, తెలుసుకుంటున్నారు.

నేను భాగవతం చదవకపోతే నేను ఈ దత్తాత్రేయుడు గురించి చెప్పగలిగే దాన్ని కాదు. అలాగే ఉద్ధవుడు గురించి చెప్పగలిగే దాన్ని కాదు. పత్రి గారు ఎప్పుడు స్వాధ్యాయం, స్వాధ్యాయం అంటూ ఉంటారు. మనం ప్రాపంచిక జీవితంలో నవల్స్ వీక్లీలు చదివి, ఏవో కల్పిత కథలు చదువుతూ అవి మన జీవితానికి అన్వయించుకొని దుఃఖపడుతూ ఉంటాం.

ఎప్పుడైతే పత్రి గారు మన జీవితంలోకి వచ్చారో సత్ గ్రంథాలు స్వాధ్యాయం చేస్తున్నాం. సత్ అంటే సత్యం అంటే భగవంతుని గురించి చెప్పే గ్రంథాలు. అది భాగవతం కావచ్చు, రామాయణం కావచ్చు, అలాగే భగవద్గీత కావచ్చు, ఉపనిషత్తులు కావచ్చు, వీటన్నిటిలో భగవంతుని గురించి ఉంటుంది. అవి వేటిని నేర్చుకోవాలి? వేటిని వదులుకోవాలి? ఏవి పొందాలి? అన్నవి తెలుస్తుంది.

భాగవతం అంతా ఎలా ఉంటుందంటే సృష్టి గురించి ఆది నుంచి వున్న దాని గురించే తెలుసుకుంటాం. ఒక్కొక్కళ్ళు ఇంత గొప్పగా ఎదగడానికి కారణం ఏమిటో మనం తెలుసుకుంటాం. భాగవతం చదవకపోతే దత్తాత్రేయుని గురించి తెలిసేది కాదు.

ఇంత గొప్పగా, ఇంత సూక్ష్మ దృష్టితో ప్రకృతి నుంచి, 24 మంది

గురువుల్ని సెలెక్ట్ చేసుకుని 24 మంది గురువుల నుంచి దత్తాత్రేయులవారు జ్ఞానాన్ని పొందాడు. ఆయనకు ఒక వ్యక్తి కాదు, ప్రకృతే గురువయ్యింది. అటువంటి దత్తాత్రేయుడు పరశురాముడికే గురువయ్యాడు. చూడండి పరశు రాముడు ఎంత గొప్పవాడో! అటువంటి ఆయనకే దత్తాత్రేయుడు గురువయ్యాడు,

వారిది మామూలు జీవితం కాదు. ఈ 64 కళలు వాళ్లు నేర్చుకున్నారు. అలా నేర్చుకోవడం వల్ల, అస్త్ర విద్య వస్తుంది, శస్త్ర విద్య వస్తుంది, పాండిత్యం వస్తుంది, జ్ఞానం వస్తుంది. 64 కళలు వాళ్లకు వస్తూ ఉంటాయి. అంతటి జ్ఞానం ఉంది కాబట్టే అంత గొప్పగా మనం చెప్పుకుంటున్నాం.

అంటే ఇప్పుడు ఈ రోజుల్లో ఈ జ్ఞానం పొందడం పుస్తకాల ద్వారా, మాస్టర్ల ద్వారా, గురువులు ద్వారా చాలా తేలికగా మనం జ్ఞానం నేర్చుకుంటున్నాం. ఇవన్నీ పత్రిగారు ఎందుకు చదవమంటారు అంటే అంత గొప్పగా మీరు కూడా ఎదగాలని. **"జీవుడు జీవుడుగా ఉండకూడదు, జీవుడు దేవుడుగా ఎదగాలి అంటారు".**

నువ్వు దేవుడు ఎలా అవుతావు అంటే? మనసుకున్న మాలిన్యాలు తొలగించుకొని. ఏది ఉంచుకోవాలో అది ఉంచుకుంటూ, ఎదుటి వాళ్ళకి ఏది ఇవ్వాలో అది ఇస్తూ, నా అనే స్వార్థం వదులుకొని, నేను అనే అహంకారం, నాది అనే మమకారం రెండు వదిలేస్తే నువ్వు గొప్పగా ఎదగవచ్చు.

ముఖ్యంగా నేను, నాది అన్నవి వదలాలి. నీవు కాని దాన్ని నీవు అంటున్నావు. నీది కాని దాన్ని నాది అంటున్నావు. చూడండి ఈ శరీరం నేను అనుకుంటే నేను రాజ్యలక్ష్మిని అని అనుకోవచ్చు. కానీ ఈ శరీరం నేను కాదు, నేను ఆత్మని.

నేను కానీ ఈ శరీరం అంటే అంత మమకారం ఎందుకు? నేను గొప్ప, నేను చదువు ఉన్నదాన్ని, నేను డబ్బున్న దాన్ని అనుకుంటే అహంకారమే. శరీరమే నేను కానప్పుడు అవి నీవా? కాదు కదా?

కానీ సృష్టిలో అంతటా ఉన్నది ఆ పరామాత్మే, అంతా ఆయనదే. నాది అనుకుంటావు, కాని నువ్వు పైకి వెళ్ళినప్పుడు ఏమి తీసుకుని వెళ్ళవు. నీ శరీరాన్నే నువ్వు తీసుకెళ్లలేవు. కానీ నాకు అంత ఆస్తి వుంది, ఇంత ఆస్తి

వుంది అనే అహంకారంలో వుంటావు.

అందుచేత ఏదైనా నలుగురికి పంచి నువ్వు తిన్నప్పుడు అది యజ్ఞఫలం తిన్నట్టు.

భగవంతుడు ఎవరు? "ఆత్మ". ఆత్మ అంతటా ఉంది కదా? చీమ నుంచి బ్రహ్మదేవుడి వరకు అన్నీ ఆత్మ స్వరూపాలే! ఆత్మ స్వరూపాలకు నువ్వు పెట్టి తింటే అది యజ్ఞ ఫలం అవుతుంది. అని భగవద్గీత మనకు బోధిస్తుంది. ఎవరికీ పెట్టకుండా తింటే అది దొంగ కూడు అవుతుంది.

ఇవన్నీ ఎప్పుడైతే తెలుసు కుంటారో! అంటే ఎవరైతే స్వార్థం వీడి నిస్వార్థంగా జీవిస్తారో! నలుగురితో పాటు ప్రతిదీ పంచుకుంటూ తిని, జ్ఞానాన్ని పెంచుకుని నేను భూమి మీదికి ఎలా వచ్చానో! అందరూ అలాగే నేర్చుకోవడానికి వచ్చారు అని గుర్తించ గలిగి, అందరూ ఒక్కటే అని భావించి, అందరి కోసం పాటుపడిన రోజున, నీవు దైవంగానే ఉంటావు.

ఇదే దత్తాత్రేయుల వారి నుంచి నేర్చుకోవలసింది.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

**website address : www.tst.org.in**

**a)** తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు **Google Maps Location** తెలుసుకోవచ్చు.

**b)** తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు **PDF** రూపంలో కలవు. వాటిని ఉచితంగా **Download** చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

**c)** తటవర్తి దంపతుల సందేశాలు **Concept** వారీగా **YouTube Play lists** రూపంలో ఇవ్వడం జరిగింది.

**d)** తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

**e)** తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

**5.** భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# గురువు వద్ద శిష్యుడి ప్రవర్తన ఎలా ఉండాలి?

గురువు వద్ద శిష్యుడు ఎలా ఉండాలి? ఎలా ఉంటే విద్య నేర్చుకోగలడు? అన్నది తెలుసుకుందాం. పూర్వం గురుకులాలలో విద్య నేర్చుకోవాలను కున్నప్పుడు అన్ని భోగాలు వదులుకొని గురువును ఆశ్రయించడానికి ఆశ్రమాలకు వెళ్ళేవారు. అక్కడ గురువుకు శుశ్రూషలు చేసేవారట. అక్కడ గురువు ఆ శిష్యులను 12 సంవత్సరాలు ఉంచుకొని చక్కగా విద్యాభ్యాసం చెప్పేవారట.

శిష్యులు అందరూ ఒకే రకంగా ఉండాలి అని వారికి ఒక ఆశ్రమ జీవితం అలవాటు చేసి, చక్కగా విద్య నేర్పి పంపే వారట. ఈ కలియుగంలో నేర్చుకోవాలి అంటే? అలాంటి ఆశ్రమాలు లేవు. ముఖ్యంగా ఆధ్యాత్మిక విద్య నేర్పేవారే లేకుండా పోయారు.

అందుచేత ఆత్మవిద్య అంటే బ్రహ్మవిద్య నేర్చుకోవాలి అనుకునేవారు, గురువు దగ్గర ఎలా ఉండాలి? ఎలా ప్రవర్తించాలి? అన్నది తెలుసుకుందాం.

**"గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వరః!**

**"గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురవే నమః."**

అని పెద్దలు చెప్పడం జరిగింది.

ఈ శ్లోకాన్ని బట్టి గురువు బ్రహ్మ, విష్ణు, శివస్వరూపాలని అర్థం. అంటే పరబ్రహ్మ ఈ మూడు స్వరూపాలలో గురువుని ఇస్తాడు అని అర్థం. ఎలా అంటే గురువు శిష్యునికి జ్ఞానాన్ని కలిగించేటప్పుడు, బ్రహ్మాస్వరూపుడు... శిష్యునికి జ్ఞానాన్ని నిరంతరం తన బోధతో పెంచి పోషిస్తున్నప్పుడు విష్ణు స్వరూపుడు... శిష్యుని అజ్ఞానాన్ని నశింప చేసేటప్పుడు శివస్వరూపుడు అని తెలుసుకోవాలి. ఈ మూడు రూపాలు కలిపితేనే పరబ్రహ్మ స్వరూపము అంటే పరబ్రహ్మే గురువుగా వస్తాడట. అందుకని గురువును గౌరవించాలి.

ప్రాపంచిక జీవితంలో వున్నప్పుడు గురువు అవసరం లేదు అనే అనుకుంటారు, అంతేకాదు విగ్రహాన్ని పూజిస్తే చాలు, స్తోత్రం చేస్తే చాలు, యజ్ఞ యాగాదులు చేస్తే చాలు, ఆలా దైవం మీద భక్తి చూపిస్తే చాలు అని అనుకుంటారు. కానీ ఇవన్నీ మానవులకు భోగాలు అంటే సుఖాలు ఇస్తాయి కానీ మోక్షాన్ని ఇవ్వలేవు.

మోక్షం పొందాలంటే? అంటే దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడాలంటే తప్పనిసరిగా ఆధ్యాత్మిక విద్య అంటే ఆత్మ విద్య అభ్యసించవలసిందే! దానికి సద్గురువును ఆశ్రయించవలసిందే!

సద్గురువును ఆశ్రయించినపుడు ఆయన నీవు శరీరానివి కాదు నీవు ఆత్మవి, నీవే కాదు ప్రతి ఒక్కడు ఆత్మ స్వరూపులే! శరీరాలు వేరు కానీ ఆత్మ ఒక్కటే! ఉన్నది ఒక్కటే చైతన్యం అదే ఆత్మ అని గురువు రూపంలో పరమాత్మ బోధిస్తాడు.

అంతవరకు రకరకాల ఆరాధనలు చేస్తూ, చాలా భక్తులం అనుకుంటారు. అందుకే ఈ అజ్ఞానాన్ని తొలగించటానికి ఒక సద్గురువు రూపంలో ఆ పరమాత్మ మన దగ్గరకు వస్తాడు.

పత్రిగారు వచ్చేవరకు అలాంటి మూఢభక్తిలోనే అందరూ ఉన్నారు. ఆయన అందరి శరీరాలలో ఉన్నది ఆ పరమాత్మే! అదే ఆత్మ అని చెప్పడమేకాదు, నీవే ఆ దేవుడివి, అంటే ఆత్మవి అని పత్రిగారు చెప్పడం జరిగింది. కానీ అజ్ఞానంలో ఉండడం వల్ల ఎవరికి వారు తాను మానవుడిని అని అను కుంటున్నారు అని పత్రిగారు చెప్పడం జరిగింది.

ఆలా పత్రిగారు లాంటి సద్గురువు వచ్చేవరకు నేనే దైవం అనే సంగతి ఎవరికీ తెలియదు. కాని ఆయన నిరంతర బోధలవల్ల నేను ఆత్మను అంటే దైవాన్ని అని ఎంతోమంది తెలుసుకున్నారు.

అంతేకాదు ఆత్మనైన నేను ఎక్కడ నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్లాలి? నా లక్ష్యం ఏమిటి? అన్నవి విష్ణుస్వరూపంగా ఉన్న గురువు వల్ల

తెలుసుకుంటాము.

అంతేకాదు ఈ శరీరమే నేను అనుకున్న వారికి ఆత్మే నేను అన్న జ్ఞానం ఇచ్చి, వారి అజ్ఞానం తొలగించారు కాబట్టి పత్రిగారు శివస్వరూపుడు అవుతాడు.

అందుకే గురువును మూడు రూపాలు కలిపి పరమాత్మ స్వరూపం అంటారు. ఇంత గొప్పగా గురువు దగ్గర నేర్చుకుని, సత్యం ఏమిటో తెలుసుకొని, సత్యం వైపు ప్రయాణం చేస్తున్న శిష్యుడు ఎలా ఉండాలి? ఎలా ఉంటే గురువులకు ఇష్టులు అవుతారు? అన్నది తెలుసుకుందాం.

ముఖ్యంగా **"శిష్యునకు గురువు నచ్చుటం కాదు, గురువుకు నచ్చేలా శిష్యుడు ఉండాలి"** అంతేకాని నేను గొప్పవాడిని, ధ్యానం చేస్తున్నాను, సేవలు చేస్తున్నాను అనుకుంటూ అహంకారంతో ఉండకూడదు. ఈ 'నేను, నేను' అనే అహంకారం గురువు దగ్గర పోగొట్టుకోవాలి.

యోగులు గురువును, శిష్యుడిని తక్కెడతో పోల్చారు. తక్కెడకు రెండు ప్రక్కలా రెండు పళ్ళాలు తాళ్లతో సమానంగా కట్టి ఉంటాయి. ఆ పళ్ళాలు లాగే ఒక ప్రక్క గురువు, ఇంకొక ప్రక్కశిష్యుడు సమానంగా ఉంటారట. కాని గురువు జ్ఞానంతో తూగితే, శిష్యుడు అజ్ఞానంతో తూగుతాడట.

ఆ తరువాత గురువుయొక్క జ్ఞానబోధతో శిష్యుడు తన అజ్ఞానం మెల్లిమెల్లిగా తొలగించుకుని జ్ఞానం పొందుతూ శిష్యుడు కూడా గురువులా తయారవుతాడు.

అందుచేత శిష్యుడు ఎంత తెలుసుకున్నా గురువు దగ్గర నాకేమీ తెలియదు అన్నట్టు గానే ఉండాలి. అంతేకాదు శిష్యుడు, తనలో ఏమాత్రం దుఃఖం ఉన్నా నాలో ఇంకా అజ్ఞానం ఉందని తెలుసుకోవాలి. ఆ దుఃఖం పోగొట్టుకోవటానికే గురువు దగ్గరకు వచ్చాను అని గురువు దగ్గర జీరో అయిపోవాలి అంటే ఒక తెల్ల కాగితంలా వుండాలిత. అప్పుడే గురువు యొక్క మాటలు, జ్ఞానం బాగా ఎక్కుతాయి అని శిష్యుడు తెలుసుకోవాలి.

సత్య సాయి బాబావారు చెప్పేవారట, ఒక న్యూస్ పేపర్ మీద ఏ

అక్షరాలు వ్రాయలేవు కాని తెల్ల పేపర్ మీద వ్రాస్తే అక్షరాలు స్పష్టంగా కనపడతాయి. అందుచేత మీ మనసు న్యూస్ పేపర్ లా ఉండకూడదు, ఒక తెల్ల కాగితంలాగా ఉండాలి అంటారట.

అందుచేత శిష్యుడు గురువు దగ్గర తెల్ల కాగితంలా ఉంటే? ఆ గురువు చెప్పిన ప్రతి విషయం బాగా అర్థం అవ్వడమే కాదు, లోతుల్లోకి అంటే హృదయంలోకి వెళ్ళిపోతుంది అని శిష్యుడు తెలుసుకోవాలి.

ప్రాపంచిక విషయాలు బోధించే గురువులు విగ్రహారాధన అంటే పూజలు చేయమంటారు, కాని సద్గురువు విగ్రహారాధనకాదు, సత్యారాధన అంటే ఆత్మారాధన అంటే ధ్యానం చేయమంటారు. ఎందుచేతనంటే? సద్గురువు సత్యంలో జీవిస్తాడు, సత్యమే చెప్తాడు కాబట్టి.

ఈ సృష్టి అంతా భగవంతునిచే సృష్టింపబడింది. పంచభూతాలు, శిలలు, లోహాలు, వృక్షాలు, జంతువులు, మానవులు అన్నీ ఈ సృష్టిలోని ఒక భాగం మాత్రమే! అంతేకాదు ఆ సృష్టి కర్తే అన్నిట్లలో ఉండి, అన్నిటిని నడిపిస్తున్నాడని గురువు చెప్తాడు. ఆ పరమాత్మను చేరే విధానం చెప్పటానికే ఆ గురువు వస్తాడు. ఈ భూమ్మీద దైవాన్ని ఒక సద్గురువు మాత్రమే తెలియ పరచగలడు.

ఇంక ఎవరైనా సరే అంటే తల్లిదండ్రులు కానీ, బంధువులు కానీ, భార్య కానీ, భర్త కానీ ఆ భగవంతుని గురించి, ఆ భగవంతుని చేరే మార్గం గురించి చెప్పలేరు. ఒక్క సద్గురువు మాత్రమే దైవానికి దగ్గరగా మనల్ని చేర్చగలడు. అటువంటి సద్గురువు మన జీవితంలోకి ఎలా వస్తాడు అంటే? పరమాత్మ గురించి పరితపిస్తే! అప్పుడు నీ జీవితంలోకి ఒక సద్గురువు వస్తాడు.

మీరాబాయి కృష్ణుడి కోసం పరితపించినప్పుడు, ఆమెకు జ్ఞానం బోధించటానికి రవిదాస్ అనే గురువు వచ్చాడు. ఆయన మహా జ్ఞాని, ఆయన మీరాబాయికి ఎలా ఆరాధిస్తే కృష్ణుడిని చేరుకోగలం అన్నది చెప్పాడు.

ఎవరిలోనైనా భక్తి ముదిరితేనే ధ్యానంలోకి వస్తారు. అప్పుడు గురువు నీవు వెతికే భగవంతుడు బయట లేడు నీ శరీరంలోనే వున్నాడు, నీవు

అంతర్ముఖం అయితేనే దక్కుతాడు అని శిష్యులకు బోధిస్తాడు. అందుచేత దైవాన్ని చూపించేవాడు గురువు కాబట్టి, గురువు దగ్గర ఎలా ప్రవర్తించాలి? ఎలా ఉండాలి? అని శిష్యుడు నేర్చుకుంటేనే ఆ విద్య శిష్యునికి వస్తుంది. గురువులు వారి నోటితో ఏమీ చెప్పరు, శిష్యుడే ఎలా వుండాలో తెలుసుకోవాలి. అందుచేత శిష్యుడు గురువు పట్ల (1) ప్రేమ, (2) సత్ ప్రవర్తన, (3) వినయం, (4) నమ్మకం, (5) విశ్వాసంతో ఉండటం నేర్చుకోవాలి.

## 1) ప్రేమ

ముందు శిష్యునికి గురువు మీద ప్రేమ ఉండాలి, అంతేకాని ఆస్తిపాస్తుల మీద, తల్లితండ్రుల మీద, భార్యా పిల్లల మీద, బంధువుల మీద, కులం మీద, మతం మీద, దేశం మీద కంటే గురువు మీద ప్రేమ చూపించాలి. ఎందుకు అంటే? వీళ్లు ఎవరూ దైవాన్ని చూపించలేరు. ఒక్క గురువే దైవాన్ని చేరే మార్గం చూపించగలడు, దైవాన్ని చూపించగలడు కాబట్టి అందరి మీద కంటే గురువు మీద ఎక్కువ ప్రేమ చూపించగలగాలి.

అప్పుడు ఆయన మాటలు, ఆయన బోధలు, ఆయన జ్ఞానం అబ్బుతాయి. ఈ ప్రపంచంలో అజ్ఞానికి ఎంతో దుఃఖం ఉంటుంది. కారణం సత్యం కాని దానిని సత్యం అని అనుకోవటమే. మరి సత్యం కాని దానిని పట్టుకున్నప్పుడు వాడి జీవితంలో ఆనందం ఎలా ఉంటుంది? ఎప్పుడూ దుఃఖమే వుంటుంది. ఆ దుఃఖం పోయే మార్గమే జ్ఞానం, ఆ జ్ఞానాన్ని ఇచ్చేది గురువే అందుచేత గురువుపట్ల ప్రేమతో ఉండాలి.

## 2.సత్ ప్రవర్తన

సత్ ప్రవర్తన అంటే నేను చెప్తే కానీ గురువుకు తెలియదు అని శిష్యుడు అనుకోకూడదు, అసత్యం చెప్పకూడదు, సత్యాన్ని చెప్పాలి. ప్రక్క వాళ్ళ మీద కాని, బయట వాళ్ల మీద కాని, నీకు నచ్చని వాళ్ల గురించి కాని, ఎవరి గురించి కూడా గురువు దగ్గర శిష్యుడు మాట్లాడకూడదు. గురువు ముందు శిష్యుడు ఎవరిని చులకనగా చూడకూడదు, చాలా జాగ్రత్తగా అంటే

దైవమే నా ముందు వచ్చి నిల్చున్నాడు, ఆయనకు ఏమి తెలియకుండా వుండదు, అంటే గురువుకు తెలియనిది అంటూ ఏమీ ఉండదు అని శిష్యుడు తెలుసు కోవాలి. ఒక సద్గురువుకు ఎంతో శక్తి ఉంటుంది, అందుకే వ్యర్థమైన మాటలు, వ్యర్థ సంభాషణలు, అవసరం లేని మాటలు, ప్రక్క వాళ్ళ మీద చాడీలు ఏది కూడా గురువు దగ్గర శిష్యుడు చెప్పకూడదు. ఆయనకు అన్ని తెలుస్తాయని తెలుసుకోవాలి. అవసరమైన మాటలే మాట్లాడాలి, అవసరం లేకపోతే మౌనంగా ఉండాలి.

అంతేకాదు గురువు మాట్లాడుతూ ఉంటే శిష్యుడు వింటూ ఉండాలి, గురువు చనువు ఇచ్చాడు కదా అని ఊరికే గలగలమని మాట్లాడకూడదు. ఇంకొక విషయం ఏమిటి అంటే? ఎదుటి వారి గురించి మాట్లాడుతుంటే నేను చెప్పిన పాఠాలు శిష్యునకు ఇంకా బోధపడలేదు అని గురువు అనుకుంటాడు. అందరిలో వున్నది ఒక్కటే ఆత్మ అని చెప్పినా వీడు ఇంకా ఇలా మాట్లాడుతున్నాడేమిటి అని గురువు అనుకుంటాడు. అంటే ఆయన చెప్పిన పాఠం శిష్యుడికి ఇంకా ఎక్కలేదు అని గ్రహిస్తాడు.

అందుకే పత్రిగారు **"నీ మాట నీకు అయిన ఉపయోగపడాలి, లేదా ఎదుటివారికైనా ఉపయోగపడాలి, ఆలా ఉపయోగపడని మాటలు మాట్లాడవద్దు"** అంటారు. ఆయన **"నో కామెంట్, నో జడ్జిమెంట్"** అంటారు. అంటే ఈ సందేశంలో ఎంతో అర్థం ఉంది. అందుచేత గురువు దగ్గర శిష్యుడు చాలా జాగ్రత్తగా, ఎరుకతో మాట్లాడాలి. ఆయన అడిగిన దానికి మాత్రమే సమాధానం చెప్పాలి, అలా శిష్యుడి ప్రవర్తన ఉండాలి.

### 3. వినయం

గురువు దగ్గర శిష్యుడు ఎంతో వినయంగా ఉండాలి. ఆ వినయం రాజు దగ్గర భటుడు ఉన్నట్టు, యజమాని దగ్గర సేవకుడు ఉన్నట్టు గురువు దగ్గర శిష్యుడు ఎంతో వినయంగా ఉండాలి. ఆలా వినయంతో ఉంటేనే శిష్యునికి జ్ఞానం వస్తూ ఉంటుంది.

అందుకే ఉపనిషత్తులు కూడా  అహంకారికి ఆత్మ జ్ఞానం అబ్బదు అని చెప్తాయి. శిష్యుడు తల ఎగరేసి, ఈ విషయం నాకు తెలుసులే అనుకోకూడదు. గురువు నోటి నుండి వచ్చింది అంటే? ఆ విషయాలు అక్కడ ఎవరికో అవసరం కాబట్టే చెప్తున్నారు అని తెలుసుకోవాలి.

శిష్యుడు తన వరకే చూసుకుంటాడు, కాని గురువు అక్కడ ఉన్న వాళ్ళకి కూడా ఆ విషయం అవసరం అని చెప్తాడు. శిష్యుడు తన బాగే చూసుకుంటాడు, కాని గురువు అందరు బాగుండాలి, అందరూ నేర్చుకోవాలి అని చెప్పినవే పదేపదే ఒకటికి నాలుగు సార్లు చెప్తాడు. దాని అర్థం అక్కడ ఎవరి బుర్రకో ఎక్కటం లేదు కాబట్టి వాళ్లకు ఎక్కించటం కోసం గురువు ప్రయత్నిస్తున్నాడు అని అర్థం చేసుకోవాలి. ఎందుచేతనంటే?

కొంతమంది శిష్యులు బాగా గ్రహించగలుగుతారు, కొంతమంది తొందరగా గ్రహించలేరు. కొంతమంది ఇది పాత కాన్సెప్టే కదా? అని అనుకుంటారు. కాని అక్కడ నీకు అహం వచ్చినట్లు.  గురువు చేత ప్రకృతి ఆ మాటలు మళ్లీ అనిపిస్తుంది అంటే కొంతమంది దానిని సరిగ్గా అర్థం చేసుకోలేదని తెలుసుకోవాలి.

అంతేకాదు ఒకోసారి ఎవరైనా ఏదైనా చిన్న విషయం చెప్పినా, చిన్న అనుభవం చెప్పినా చప్పట్లు కొట్టించి గురువు వారిని పృశంసిస్తారు. అప్పుడు సీనియర్లు ఏమనుకుంటారంటే? ఆమాత్రం దానికే చప్పట్లు కొట్టించాలా! ఆ విషయాలు నాకు ఎప్పుడో తెలుసు, అంతకంటే గొప్ప అనుభవం నాకు వచ్చింది, అదేమంత గొప్పది అని మనసులో అనుకుంటారు.

కాని గురువు అంత చిన్న విషయానికి కూడా అంతలా చప్పట్లు కొట్టించడానికి కారణం లేకపోలేదు. ఒక ఉదాహరణ చూద్దాం. చూడండి కొత్తగా నడక నేర్చుకున్న చిన్న పిల్లవాడు తప్పటడుగులు వేస్తాడు. అప్పుడు అందరూ చప్పట్లు కొట్టి వాడిని ప్రోత్సహిస్తారు. అంతేగాని వాడేదో గొప్ప పని చేశాడని కాదు, వాడి విషయంలో వాడు గొప్ప విద్య నేర్చుకున్నట్టే!

అది చూసి నేను పరిగెడుతున్నాను, కాని నాకు ఎవరూ తప్పట్లు కొట్టట్లేదు ఏమిటి? ఆ మాత్రం దానికే తప్పట్లు కొట్టాలా అని అనుకుంటే వాడు మూర్ఖుడు కింద లెక్క. ఎందుచేతంటే? ఆ చిన్న పిల్లవాడి స్థాయికి అది చాలా గొప్పదే!

అలాగే కొత్తగా ఈ ధ్యాన మార్గంలో ప్రవేశించిన వాడికి చిన్న అనుభవాలు వచ్చినా, అలాగే కొద్దిగా నేర్చుకున్నా అది వారికి గొప్పదే! అందుకే గురువులు వారిని ఆలా ప్రోత్సహిస్తారు, కాని ఇది శిష్యులకు అర్థం కాదు.

అందుచేత సద్గురువులు ఎప్పుడు ఏమి చేస్తారో ఎవరికి అర్థం కాదు. అందుచేత గురువు చేసే పనులు గురించి కానీ, చెప్పే మాటలు గురించి కానీ శిష్యుడు ఆలోచించకూడదు, ఆయన చేసే ప్రతి దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి, అంతేకాదు గురువు చెప్పే ప్రతిదానికి ఏదో అర్థం, కారణం వుంటుంది అది శిష్యులకు అర్థం కాదు.

శిష్యుడు మొదటిసారి విన్నప్పుడు శ్రవణం అవుతుంది, రెండవసారి విన్నప్పుడు మననం అవుతుంది. అయినా శిష్యుడు లోతుల్లోకి వెళ్ళటం లేదు కాబట్టి వెళ్లే వరకు గురువు చెప్తున్నాడు అని వినయంగా ఉండాలి, అహంతో మనసును ఇంకొక వైపుకు వెళ్ళనివ్వకూడదు. శిష్యుడు ఏం చేస్తున్నా గురువుకు అన్నీ తెలుస్తుంటాయి కాబట్టి, శిష్యుని మనసు నిశ్చలం చేసుకోవాలి. శిష్యుని దృష్టి గురువు మీద తప్ప ప్రక్కకు  పోకుండా నిశ్చలంగా ఉన్నప్పుడే అమూల్యమైన రత్నాల్లాంటి గురువు మాటలు శిష్యుని లోతుల్లోకి వెళ్ళిపోతుంటాయి.

## 4.నమ్మకం

శిష్యునకు సద్గురువు చెప్పే సాధన మీద, బోధల మీద నమ్మకం వుండాలి. ఆ సాధన చేస్తున్నప్పుడు సరికాని సాధనలు ఎవరు చెప్పినా నమ్మకూడదు. సద్గురువు ఏం చెప్తున్నా అది పరమాత్మ చెప్తున్నాడు అనే నమ్మకంతో వినాలి. సద్గురువు "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయాలి అని చెప్పినపుడు అది కాదని పదిమంది చెప్పేది వింటే నష్టపోయేది శిష్యుడే!

ఎందుచేతనంటే? సద్గురువు ఎంతసేపూ అనుభవ జ్ఞానంతో చెప్తాడు.

అందుచేత ఏ శిష్యుడైన ముందు తాను ఆశ్రయించింది సద్గురువును అని నిర్ధారించుకోవాలి, సద్గురువు లక్షణాలు తెలుసుకోవాలి, అటువంటి సద్గురువును గుడ్డిగా నమ్మినా కూడా శిష్యుడు నష్టపోడు.

అంతేకాదు శిష్యుడు ఈ “శ్వాస మీద ధ్యాస” ధ్యానం గురించి లోతుగా అధ్యయనం చేస్తే అది ఎంత గొప్పదో అర్థం అవుతుంది. అంతేకాదు నీవే దేవుడవు అని గురువు చెప్తుంటే అది సత్యం అని నమ్మి, దైవం ఎలా అవుతావో! దైవం కావడానికి కావలసిన జ్ఞానం ఎలా పొందాలి? ఏ సాధన చేయాలి? అని ఆలోచించాలి. అంతేకానీ నేను దేవుడేమిటి? నాకు మహత్యాలు లేవు కదా? నేనెలా దేవుడు అవుతాను? నేను దేవుడవుతే ఈ కష్టాలు ఏమిటి? అని నిరుత్సాహపడితే ఎన్ని జన్మలు ఎత్తిన దైవానివి కాలేవు.

కాని జీవుడిగా పుట్టిన ప్రతివాడు దైవం కావడానికే భూమ్మీదకు వస్తాడు. అదే సద్గురువు చెప్తాడు. జీవుడిగా పుట్టిన శిష్యుడు, అనుభవాలు పొంది, పాఠాలు నేర్చుకొని తానే దైవం అని తెలుసుకునే వరకు భూమ్మీదకు మళ్లీమళ్లీ వస్తాడు. అందుకే సద్గురువు మాటల మీద నమ్మకం ఉంచాలి. గురువు వాక్కు నాకు వేదవాక్కు అనే నమ్మకం ఉండాలి, అప్పుడే శిష్యుడు దేవుడు కాగలుగుతాడు, దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడతాడు.

## 5.విశ్వాసం

శిష్యునకు గురువు మాట మీద విశ్వాసం ఉండాలి. కారణం అలాంటి మహానుభావుల నోటి వెంట అసత్యపు మాటలు రావు, వారు ఎప్పుడూ సత్యమే చెబుతారు, జ్ఞానపరమైన మాటలే చెబుతారు.

శబరి గురించి అందరికీ తెలుసు శబరి అనే పేరు ఆవిడకు ఎలా వచ్చిందంటే? ఆమె సమ, దమాది షట్ సంపత్తి భక్తితో ఆచరించింది. షట్ సంపత్తి అంటే సమము, దమము, తితిక్ష, ఉపరతి, శ్రద్ధ సమాధానం ఈ 6 కూడా ఆమె భక్తితో ఆచరించేదట అందుకే ఆవిడకు శబరి అన్న పేరు వచ్చింది.

శబరి గురువు మాతంగ మహర్షి. శబరి మాతంగ మహర్షి ఆశ్రమంలో

పనిచేసే దాసి, కానీ ఎన్నో విషయాలు ఆ గురువు యొక్క సజ్జన సాంగత్యం వల్ల, అక్కడికి వచ్చే శిష్యుల వల్ల, మునుల వల్ల, వారు పరమాత్మ గురించి మాట్లాడుకునె మాటల వల్ల ఆమెకు ఆ పరమాత్మ మీద విపరీతమైన భక్తి కలిగింది. ఆ భక్తి వల్ల ఆమె పరమాత్మను దర్శించాలని అనుకుంది. అప్పుడు శబరి మాతంగ మహర్షిని అడిగింది, గురువుగారు మీరు చదువుకున్నారు, సాధన చేస్తున్నారు, చర్చా గోష్టులు చేస్తున్నారు, నేను దాసిని కదా? నాకు ఆ పరమాత్మ దర్శనం కలుగుతుందా? అని అడిగింది.

అప్పుడు మాతంగ మహర్షి మేము కొంచెం సేపే సాధన చేస్తున్నాము, కానీ నువ్వు ఆ పరమాత్మ చింతన తప్ప రెండోది నీకు లేదు, అంటే నువ్వు నిరంతర సాధనలోనే ఉన్నావు, నీకు తప్పకుండా శ్రీరాముని రూపంలో ఆ పరమాత్మే నీ దగ్గరకు వస్తాడు అని మాతంగ మహర్షి చెప్పాడు. శబరి గురువు మాటలు విశ్వసించింది, శ్రీరాముని కోసం ఎదురు చూసింది, చివరకు శ్రీరాముని దర్శనం చేసుకుంది.

మనందరం కూడా పత్రిగారు ఏం చెప్పినా, నా ఆత్మఉద్ధరణ కోసం చెప్తున్నారు, నా దుఃఖం పోగొట్టుకొనే మార్గమే ఈ ధ్యానం. గురువు జ్ఞానం పొందడానికే నాకు ఈ “శ్వాస మీద ధ్యాస” అన్న ధ్యానం చెప్పారని ఆయన మాటల మీద విశ్వాసం ఉంచుకున్నాము. ఆలా పత్రిగారి మీద విశ్వాసం వుంచుకున్నాము కాబట్టే ఇంత తీవ్ర సాధన, ఇంత శ్రద్ధగా చేస్తున్నాము. అంతేకాదు జ్ఞాన పరంగా ఎంతో ఎదిగాను.

అందుచేత శిష్యుడు గురువు మాట విశ్వసించాలి. అంతేకాదు గురువు ఏది శాశ్వతం? ఏది అశాశ్వతం? అని చెప్పటం వల్ల, నిత్య, అనిత్య వస్తు వివేకం శిష్యునకు వస్తుంది. అప్పుడు ఆత్మను పట్టుకోవాలా? విగ్రహాన్ని పట్టుకోవాలా? ప్రపంచాన్ని పట్టుకోవాలా? పరమాత్మను పట్టుకోవాలా? అన్నవి శిష్యుడు నేర్చుకుంటాడు. అంతేకాదు గురువు నుంచి ఏ పని చేయాలి? ఎలా చేయాలి? ఎప్పుడు చేయాలి? ఎలా మాట్లాడాలి? ఏం తినాలి? ఎంత తినాలి?

ఎలా సాధన చేయాలి? ఎంత సాధన చేయాలి? జ్ఞానం ఎలా పెంచుకోవాలి? ఇలాంటివన్నీ గురువు నుంచి శిష్యుడు నేర్చుకుంటాడు.

అంతేకాదు శిష్యుడు గురువు మాట మీద దృష్టి పెట్టాలి కాని, గురువు చేసే పనుల మీద దృష్టి పెట్టకూడదు. అప్పుడే శిష్యుడు ఎదుగుతూ ఉంటాడు. కొంతమంది శిష్యులు నేను చాలా తెలుసుకున్నాను, చాలా మందికి క్లాసులు కూడా చెబుతున్నాను, గురువులా ఎదిగాను అని భావించడమే కాదు, నాకు అన్నీ తెలుసు అని అనుకుంటారు. కానీ శిష్యుడు ఒక అడుగు ఎదిగితే గురువు పది అడుగులు ముందుకు ఎదుగుతాడని తెలుసుకోవాలి.

అందుచేత గురువు దగ్గర ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవలసింది ఉంటూనే ఉంటుంది అని తెలుసుకుని, వినయంగా ఉంటూ ఇంకా ఎన్నో నేర్చుకుంటూ ఎదగడానికి ప్రయత్నించాలి.

గురువు వల్ల ఇవన్నీ తెలుసుకుని ఆచరించాక శిష్యుడు ఆనందంలో వుంటాడు, అనంతం వైపుకు పయనిస్తూ వుంటాడు. అంతేకాదు అనంత లోకాలలో ఎలా వుంటారో అన్నది ఆ గురువు వల్ల అర్థం అవుతుంది. కారణం గురువు అదః పాతాళానికి వెళ్లకుండా శిష్యుని అనంత లోకాలకు తీసుకెళ్తాడు. సద్గురువు శిష్యుని జీవితంలోకి రాకపోతే దుఃఖంలో కురుకుపోవడమే కాదు, 'పునరపి జననం – పునరపి మరణం' అని తిరుగుతూనే వుంటాడు.

అందుచేత శిష్యుడు గురువు ఎడల శ్రద్ధతో, వినయంగా, గౌరవంగా, భక్తిగా, కృతజ్ఞతా భావంతో ఉండాలి. అలా ఉన్నప్పుడే గురువు ద్వారా నీకు అనంతమైన జ్ఞానం అందుతుంది. బయట ప్రపంచంలో ఎవరు ఇలాంటి విషయాలు చెప్పలేరు. ఒకవేళ చెప్పినా పాపం, పుణ్యం గురించి మాత్రమే చెప్పగలరు. కానీ సత్య లోకం తీసుకు వెళ్ళేది సద్గురువు మాత్రమే అని తెలుసుకోవాలి.

అందుచేత ఏ శిష్యుడైనా ఆధ్యాత్మికంగా ఎదగాలంటే? సద్గురువు పట్ల ఈ రకమైన ప్రవర్తన కలిగి వుండాలి.

# జీవుడైన మానవుడు దేవుడిగా ఎదగాలంటే?

చాలామంది 'జీవుడే దేవుడు' అని అంటూ ఉంటారు. 'జీవుడైన తాను దేవుడే' అంటే 'నేనే దైవాన్ని' అని చెప్పినప్పుడు నేను దైవమేంటి? నేను మానవుడను కదా? అని అనుకోవచ్చు.

అందుకే శంకరాచార్యులవారు జీవాత్మకి, పరమాత్మకి శక్తిలో ఎంత తేడా ఉందో అన్నది నాలుగు ఉపమానాల ద్వారా తెలియపరిచారు. వాటిని బట్టి జీవుడిలో వున్న ఆత్మకి అంటే జీవుడిలో అంటే జీవాత్మలో ఎంత శక్తి వుంటుంది? పరమాత్మ అంటే సృష్టి అంతా వ్యాపించి వున్న, సృష్టిని నడిపిస్తున్న పరమాత్ముడికి ఎంత శక్తి ఉంటుంది? అన్నది తెలుసుకోవచ్చు.

**1) ఆయన "పరమాత్మను సూర్యుడుతోను, జీవాత్మను మిణుగురు పురుగు తోను పోల్చారు".**

శంకరాచార్యులు వారు పరమాత్మను సూర్యుడుతో పోల్చారు. సూర్యుడు సకల జీవరాసులకు, సమస్త సృష్టికి తన కిరణాల ద్వారా వెలుతురునిస్తూ ఎన్నో లోకోపకార పనులు చేస్తున్నాడు.

ఆయన ఇచ్చే వెలుగు వల్ల సమస్త జీవరాశి తమ తమ కార్యకలాపాలు చేసుకోగలుగుతున్నాయి. అంతేకాదు సశ్యాలు, మొక్కలు, చెట్లు, వృక్షాలు సూర్యరశ్మితో జరిగే కిరణ జన్య సంయోగ క్రియ వల్ల తయారు చేసే ధాన్యాలు, కాయగూరలు, పళ్ళతో సమస్త జీవరాశి జీవిస్తున్నాయి, అంత గొప్పవాడు సూర్యుడు .

అంతే కాదు ఈ సూర్యకిరణాలవల్లే సముద్రంలో నీళ్లు ఆవిరై మళ్ళీ వర్షంగా వచ్చి ఈ భూమ్మీద జీవులకి, జీవరాశులకి అన్నింటికీ కూడా ఉప యోగ పడుతున్నాయి. సూర్య భగవానుడు లోకానికి అంత మేలు చేస్తున్నాడు. అందుకే పరమాత్మను సూర్యునితో పోల్చారు.

మిణుగురు పురుగు అతి కొద్దిగా వెలుగునిస్తుంది. ఆ వెలుగు లోకానికి ఏమీ ఉపయోగపడదు. అలాగే జీవాత్మ తన శరీరం కదలికలకు, ఇంద్రియాలు పనిచేయడానికి తప్ప, ఇంక లోకానికేమీ ఉపయోగ పడదు.

అందుకే పరమాత్మను సూర్యుడుతోను, జీవాత్మను మిణుగురు పురుగుతోను పోల్చారు. అందుచేత పరమాత్మకి, జీవాత్మకి అంత తేడా ఉంది. ఆలోచించండి మిణుగురు పురుగు చాలా చిన్నది కాని సూర్యుడు ఎంత గొప్పవాడు? అందుకే శంకరాచార్యుల వారు పరమాత్మని సూర్యుడుతో పోల్చారు. జీవాత్మని మిణుగురు పురుగుతో పోల్చడం జరిగింది.

**2) "పరమాత్మను రాజుతో, జీవాత్మను సేవకుడుతో పోల్చారు"**

రాజు తన రాజ్యంలో ప్రజలందరినీ పాలిస్తాడు, రాజ్యాన్ని శత్రువుల నుండి రక్షిస్తాడు. కానీ సేవకుడు రాజు గారి ఆజ్ఞకి విధేయుడై ప్రవర్తించాలి. అలాగే పరమాత్మ సృష్టినంతటిని పాలించేవాడు. కానీ జీవాత్మ పరమాత్మ యొక్క కొన్ని ధర్మాలకి కట్టుబడి జీవిస్తాడు.

ఇక్కడ గమనిస్తే పరమాత్మ సృష్టినంతటిని అంటే జీవుల్ని, జీవరాసుల్ని, గ్రహాల్ని, నక్షత్రాల్ని, కొన్ని లోకాల్ని అన్నింటిని తన ప్రాణ శక్తితో జీవింప చేస్తాడు. కొన్ని ధర్మాలు, సిద్ధాంతాలు ఏర్పాటుచేసి వాటికి అనుగుణంగా జీవుల్ని, జీవరాసుల్ని జీవించేలా చేశాడు.

కానీ సేవకుడు రాజు గారి ఆజ్ఞకి ఎలా కట్టుబడి పని చేస్తాడో! అలాగే జీవాత్మ పరమాత్మ పెట్టిన ధర్మాలకి అనుగుణంగా జీవించాలి. అందుకే శంకరాచార్యుల వారు పరమాత్మను రాజుతోను, జీవాత్మను సేవకునితోని పోల్చారు.

**3) "పరమాత్మను సముద్రంతోను, జీవాత్మను బావితోను పోల్చారు"**

సముద్రంలో నీరు ఆవిరిగా మారి వర్షంగా వర్షిస్తుంది. సముద్ర గర్భంలో ఎన్నో జలచరాలు, రకరకాల జీవులు జీవిస్తూ వుంటాయి. వాటితోపాటు రత్నాలు, ముత్యాలు ఉంటాయి. అలాగే సముద్రంలో నీరు ఎంత ఆవిరైనా

సముద్రం కొంచంకూడా తగ్గదు. అలాగే ఎన్ని నదులు వచ్చి కలిసినా సముద్రం పొంగిపోదు.

సముద్రంలాగే పరమాత్మ నుంచి ఎంత సృష్టి జరిగినా, ఎన్ని జీవరాశులు, లోకాలు, గ్రహాలు సృష్టింపబడినా, పరమాత్మ తగ్గిపోదు, ఆయనలో ఎన్ని జీవులు కలసిపోయినా ఆయన పెరగడు.

అలాగే జీవుడ్ని నూతితో పోల్చారు. నుయ్యి ఇంట్లోవున్న వారికే ఉపయోగపడుతుంది. కొన్నాళ్ళు వాడకపోతే నీళ్లు పాడైపోతాయి. అందుకే పరమాత్మను సముద్రం తోటి, జీవాత్మను నూతి తోటి పోల్చారు.

బావి ఇంట్లో వాళ్లకి ఉపయోగపడినట్టే! జీవాత్మ తన కుటుంబానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అందుకే జీవుడు జీవాత్మగా ఉండిపోకుండా, పరమాత్మగా ఎదగాలని చెప్పడానికి కారణం.

**4) "పరమాత్మ మేరు పర్వతం లాంటివాడు, జీవాత్మ అణువుతో సమానం అన్నారు"**

మరి మేరు పర్వతానికి అణువుకి ఏంత తేడావుందో ఆలోచించండి? ఒక రకంగా చెప్పాలంటే నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉంటుంది.

మేరు పర్వతం ఎన్నింటికో ఆశ్రయమిస్తుంది. అలాగే పరమాత్మ ఎందరికో తన సృష్టిలో ఆశ్రయమివ్వడమే కాదు, వారి మనుగడకు కావలసినవన్నీ ఇవ్వడం జరిగింది. మరి ఈ అణువు లాంటి జీవాత్మ మానవుడి యొక్క శరీరంలో వుండి ఆ శరీరానికి మాత్రమే చలనం కలిగించగలుగుతుంది.

మేరు పర్వతం చూడండి దానిమీద ఎన్ని చెట్లు ఉంటాయి, ఎన్ని జీవులు దానిమీద నివసిస్తాయి. వాటికి ఎన్నో లాభాలు ఉంటాయి.

అలాగే అణువంత ఉన్న జీవాత్మ సూది మొన కంటే చాలా తక్కువ వుంటుంది. అణువు కంటే చిన్నదైన ఈ జీవాత్మ జీవుల శరీరాలలో ఉండి ఆ జీవులకు మాత్రమే చలనం కలిగించగలదు.

మరి అనంతంగా ఉన్న, సృష్టి నంతటిని నడుపుతున్నది పరమాత్మ,

కాని, జీవుల శరీరాలు మాత్రమే నడపుతున్నది జీవాత్మ కాబట్టి, శంకరాచార్యులవారు పరామాత్మకి, జీవాత్మకి ఎంత తేడా ఉందో ఈ ఉపమానం ద్వారా వివరించడం జరిగింది.

ఇదంతా తెలియచేయడం ఎందుకు అంటే? జీవుడు అంటే మానవుడు అహంకారం పెంచుకోకుండా ఉండడానికే! తనస్థితి తనకు తెలియచేయడానికే! ఆలా మెల్లిగా యోగమార్గంలోకి  వచ్చాక తత్వాన్ని అర్థం చేసుకుంటాడు. ఆ తత్వ దృష్టితోనే చూస్తాడు. అందుచేత జీవుడు దేవుడిగా ఎదగాలంటే?  తత్వ దృష్టి ఉండ వలసిందే! అప్పుడే ఎదగగలడు.

ఇప్పటి వరకు జీవాత్మకు, పరమాత్మకు ఉన్న భేదం చూసాము, కానీ రెండిటిలో ఉన్న తత్వం ఒక్కటే అన్నది కూడా తెలుసుకుందాం.

చూడండి సూర్యుడిలో ఉన్న అగ్నితత్వం, మిణుగురు పురుగులో ఉన్న అగ్ని తత్వం ఒక్కటే అని  సాధకుడు తెలుసుకోవాలి. సూర్యుడిలో ఉన్న అగ్ని తత్వం అపరిమితం. మిణుగురుపురుగులో ఉన్న అగ్ని తత్వం  పరిమితమే. కానీ రెండూ అగ్నితత్వంలో ఉన్నవే. ఇది ధ్యాన సాధన లోకి వచ్చి జ్ఞానం సంపాదించుకుని తత్వదృష్టితో చూసినప్పుడు  రెండింట్లో ఉన్న అగ్నితత్వం ఒక్కటే అని అర్థమవుతుంది.

అలాగే  రాజ్యం పోయినా రాజు జీవుడే, ఉద్యోగం పోతే సేవకుడు జీవుడే అంటే ఇద్దరూ జీవుళ్ళే! అంటే  పరమాత్మ, జీవాత్మ ఇద్దరూ భగవంతుళ్ళే ఇద్దరూ పరమాత్మలే అని అర్థం అవుతుంది.

అలాగే  పరమాత్మనుంచే జీవాత్మ వచ్చింది కాబట్టి రెండూ ఒకటే అనే తత్వ దృష్టి రావాలి.

అందుకే జీవుడు అంటే మానవుడు, బాహ్యా దృష్టిలో అహం పెంచుకోకుండా ఉండడానికే ఈ ఉపమానాలు చెబుతూ ఉంటారు. అలాగే సాధకుని యొక్క తత్వ దృష్టిని ఎలా పెంచుకోవాలో శంకరాచార్యులు వారు చెప్పడం జరిగింది.

అలాగే సముద్రంలోనిది నీరే, నూతిలోనిది నీరే! రెండిట్లలోనూ నీళ్ళే వున్నాయి. ఈ తత్వ దృష్టి వచ్చినప్పుడు రెండింట్లో ఉన్న జలతత్వం ఒక్కటే అని అర్థమవుతుంది. అంటే సముద్రంలో నీరుంది, నూతిలోని నీరుంది. రెండు జలతత్వమే. తత్వ దృష్టిలో ఉన్నప్పుడు ఆ రెండింటిలో ఉన్న జలతత్వాన్ని చూడాలి. ఇక్కడ పెద్దదా? చిన్నదా? అని కాదు. అలాగే మేరు పర్వతం, పరమాణువు రెండిటిలోవున్న భూమి తత్వం ఒక్కటే! ఒకటి పెద్దది అవ్వచ్చు, రెండవది సూక్ష్మము అవ్వచ్చు. కానీ రెండింట్లో ఉన్న తత్త్వం ఒక్కటే భూతత్వం.

పరమాత్మ, జీవాత్మ ఒకటే అని ఎందుకు అంటున్నారు అంటే? పరమాత్మలో ఉన్న తత్వం, జీవుడులో ఉన్న తత్వం ఒకటే అని చెప్పడానికే! ఇన్ని ఉపమానాలు మనకు చెప్పడం జరిగింది. మానవునకు తత్వ దృష్టి ఎలా రావాలి అన్నది ఉపమానాలద్వారా నేర్పడం జరిగింది.

మొట్టమొదట అహంకారం పెంచుకోకుండా ఉండాలి. అంటే నేనే భగవంతుడ్ని అనే అహంకారం రాకూడదు. ధ్యానసాధన చేసి యోగత్వంలో ఎదుగుతున్నప్పుడు ఆ తత్వం ఏమిటో తెలుసుకోవాలి.

సూర్యుడిలో, మిణుగురు పురుగులో ఉన్న ఆ అగ్ని తత్వాన్ని, అలాగే సేవకుడు, రాజు ఇద్దరూ జీవాత్మలే అని, అలాగే సముద్రం, బావి రెండిటిలో ఉన్న నీటి తత్వం ఒకటే, అలాగే మేరు పర్వతం, పరమాణువు రెండింటిలో ఉన్న భూమి తత్వం ఒక్కటే అని తెలుసుకోవాలి.

ఆలా శంకరాచార్యుల వారు ఒకే వస్తువుని బాహ్య దృష్టిలో అంటే జ్ఞానం లేనప్పుడు చూసేదానిని, అంతరంలో తత్వ దృష్టితో జ్ఞానం వున్నప్పుడు ఎలా చూడాలో నేర్పించారు.

ఆలా సముద్రంతో, రాజుతో, పర్వతంతో, సూర్యుడుతో పోల్చి పరమాత్మ యొక్క గొప్పతనం చెప్పడం జరిగింది. అలాగే మిణుగురు పురుగు, భావి, సేవకుడు, అణువులను జీవాత్మతో పోల్చి చెప్పడం జరిగింది.

అందుచేత ఒక యోగి ధ్యాన సాధన చేస్తున్న కొద్ది తన దృష్టిని

మార్చుకుంటూ ఉండాలి, మెల్లిగా తత్వ దృష్టితో చూడాలి. అలాగే వాటిలో ఉ న్న తత్వాలు  పెద్దదా? చిన్నదా?  కాదు, కావలసింది తత్వ దృష్టి.

అలాగే మొక్కలు ఏ తత్వంలో ఉన్నాయి? భూచరాలు, జలచరాలు, పక్షులు, జంతువులు, మానవులు ఏ ఏ తత్వాలతో ఉన్నాయో తెలుసుకోవాలి. అందుచేత సాధన చేసేవాడి జ్ఞానం పెరగాలంటే? బాహ్యదృష్టే కాదు, తత్వ దృష్టి కూడా ఉంటేనే అంతరంలో ఉన్న పరమాత్మని చూడగలుగుతారు.

అందుచేత తత్వ దృష్టి లేకుండా సాధకుడు ఎదగలేడు అని తెలుసుకోవాలి.

ఇంకా లోతుల్లోకి వెళితే పరమాత్మ తాను సృష్టించిన ఒక్కొక్క దానిలో, ఒక్కొక్క ఉపయోగం కోసం, ఒక్కొక్క తత్వాన్ని ఎక్కువ పెట్టడం జరిగింది, ఒక్కొక్క దానిలో తక్కువ పెట్టడం జరిగిందని  తెలుసుకోవాలి.

సూర్యుడిలో అగ్నితత్వం ఎందుకుంది? లోకుల క్షేమం కోసం, లోకాన్ని రక్షించడం కోసం.

అలాగే సముద్రంలో నీళ్లు ఎందుకు ఎక్కువ ఉన్నాయి? అంటే ఆ సముద్రపు నీరే వర్ష రూపంలో ఈ భూమి మీద పంటల కోసం, మొక్కలు, వృక్షాల కోసం, జీవుల ఆకలి, దాహం తీర్చడం కోసం వచ్చి అందర్నీ కాపాడుతుంది.

అలాగే భూమి మీద క్రమశిక్షణ ఉండాలి కాబట్టి ఒకడు రాజయ్యాడు. అందుకే అందరూ రాజులు కాలేరు. అలాగే పనులు చేసేవారు ఉండాలి కాబట్టి సేవకులు ఉన్నారు. కాని ఇక్కడ తత్వదృష్టితో చూసినప్పుడు ఇద్దరూ ఒక్కటే అని తెలుస్తుంది

అలాగే మేరు పర్వతం, అణువుని చూసినప్పుడు వాటి తత్వాలు, వాటి యొక్క శక్తులు మనకి అర్థమవుతాయి.

సూర్యుడు కానీ, సముద్రం కానీ, మేరు పర్వతం కానీ, రాజు కానీ ఒకే రకంగా ఉపయోగ పడరు, ఎవరికి ఏ శక్తి వుందో ఆ శక్తినే  ప్రపంచానికి ఇస్తూ ఉంటారు. అలాగే సాధకులు కూడా వారికి వున్న జ్ఞానం, నైపుణ్యం,

వనరులు, ఈ ప్రపంచానికి ఇవ్వగలిగితే పరమాత్మ స్థాయికి చేరుకోగలుగుతారు.

అందుచేత జీవాత్మ అంటే మానవుడు ఎప్పుడు కూడా జీవాత్మలా అంటే మానవుడిలాగే ఉండిపోకూడదు. అందుచేత సరైన ధ్యాన సాధన చేస్తూ సత్య జ్ఞానం సంపాదించుకుంటేనే మానవుడు పరమాత్మగా ఎదగగలుగుతాడు.

అంతేకాని ఏమి చేయకుండా ఊరికే కర్మలు చేస్తూ, నేను దేవుడ్ని అనుకుంటే అవ్వడు.

వేదాలలో “అహం బ్రహ్మోస్మి” అని వుంది. ఈ సత్యం అంటే నేను బ్రహ్మం అని తెలుసుకోవడానికి ధ్యానసాధన ఒక్కటే మార్గం. అంటే సాధకుని దృష్టి బాహ్యంగా కాకుండా అంతరంగా మారినప్పుడు మాత్రమే తత్వ దృష్టి వస్తుంది. అప్పుడు మాత్రమే లోకానికి ఏదైనా ఇవ్వాలి అన్న ఆలోచన వస్తుంది. ఆలా ఇచ్చినప్పుడు మాత్రమే సృష్టి నుంచి అన్ని పొందే అర్హత వస్తుంది.

ఏది చెప్పుకున్నా, ఎలా చెప్పుకున్నా సాధన, జ్ఞానం లేకపోతే జీవుడు జీవుడు గానే ఉంటాడు, ద్వైతంలో ఉంటాడు. కాని సాధన, జ్ఞానము ఉన్నప్పుడు జీవుడు దేవుడుగా ఎదగడానికి ప్రయత్నిస్తూ అద్వైతంగా, పరమాత్మగా జీవించగలుగుతాడు. మానవుడు మాధవుడు అవుతాడు.




## పత్రి గారి పుస్తకములు

| | | |
|---|---|---|
| 1) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 2) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 3) యోగుల సందేశాలు | - | రూ.160/- |
| 4) జ్ఞాన సందేశాలు | - | రూ.160/- |
| 5) పత్రీజీ సందేశాలు | - | రూ.160/- |
| 6) విజ్ఞానసారం | - | రూ.160/- |
| 7) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |

# విశేషమైన జ్ఞానం పొందాలంటే?

ధ్యానంలోకి వచ్చినవారు కొన్ని లాభాలు పొంది, ఆ లాభాలు అందరూ పొందాలని అందరికీ ధ్యానం చెపుతూఉంటారు. కానీ అందరూ చేస్తారా? అంటే చెయ్యరు.

పత్రి గారు ఎన్నో లక్షల మందికి ధ్యానం చెప్పారు. అంతేకాదు ఆయన పుస్తకాల ద్వారా, వీడియోల ద్వారా ఈ సత్యం అందరికీ బోధించారు.

కాని కొంతమంది ఆచరిస్తున్నారు? చాలామంది ఆచరించలేక పోతున్నారు. ఈ సత్యాన్ని, ధర్మాన్ని కొంతమందికి తెలుసుకోవాలనే తపన కూడా ఉండదు. కాని కొద్దిమందికి మాత్రమే అవగాహన ఉంటుంది.

దీనికి ముఖ్యకారణం ఇంద్రియ నిగ్రహం లేకపోవడం అంటే మనస్సును నిగ్రహించుకోలేకపోవడం.

అందుచేత మనస్సు ఏ విధంగా ఉంటే సత్యాన్ని గ్రహించగలరో! ధర్మాన్ని ఆచరణలో పెట్టుకోగలరో! తెలుసుకుందాం.

ముఖ్యంగా మనస్సు మూడు రకాలుగా ఉంటుంది.

1) మలిన మనస్సు, 2) శుద్ధ మనస్సు, 3) విశుద్ధ మనస్సు

ఇక్కడ మనస్సు మలినంగా వుంటే ప్రవర్తన ఎలా వుంటుంది? శుద్ధంగా వుంటే ప్రవర్తన ఎలా వుంటుంది? విశుద్ధంగా వుంటే ప్రవర్తన ఎలా వుంటుంది? అన్నది తెలుసుకుందాం.

**1) మలిన మనస్సు:-**

ముందు మలిన మనస్సు వున్న వారి ప్రవర్తన ఎలా వుంటుందో తెలుసుకుందాం. మలిన మనస్సు కలిగినవారికి చూసినవన్నీ కావాలి అనే కోరిక వుంటుంది. వారు అవి అవసరమా? కాదా? అని చూడరు. అలాగే అవి కొనే తాహతు నాకు వుందా? లేదా? అని ఆలోచించరు. అంతేకాదు చూసినవన్నీ కావాలంటారు, పనికిరాని మాటలు వింటారు. పనికిరాని మాటలు మాట్లాడుతారు, పనికిరానివి తింటారు, తాహతుకు మించి భోగాల మీద ఆసక్తి

ఉంటుంది.

ఆలా మలిన మనస్సు చెయ్యకూడని పనులు అంటే చెడు చూడడం, చెడు మాట్లాడడం, చెడు వినడం, చెడు ఆలోచించడం చేస్తూవుంటుంది.

ఆలా మలిన మనస్సు మానవులను కష్టాలపాలు చేస్తుంది. అటువంటి వారు ఇతరులకు సేవ చెయ్యవలసిన చేతులతో ఇతరులను కొట్టడానికి, కాళ్లు, చేతులు నరకడానికి ఉపయోగిస్తారు. అలాగే మంచి ప్రదేశానికి వెళ్ళవలసిన కాళ్లను వ్యభిచార గృహాలకు, మద్యం దుకాణాలకు వెళ్లడానికి ఉపయోగిస్తారు.

మనసు మలినంగా ఉన్నవారు దేవుడు గొప్పవాడని చెప్తారు, పూజలు చేస్తారు కాని తప్పులు చేస్తూ ఉంటారు, అబద్ధాలు మానరు, ఇతరులను విమర్శించడం మానరు.

మరి మనస్సు ఎందుకు మలినం అవుతుంది? అంటే తినకూడనివి తినడం వల్ల, అలాగే చేయకూడని పనులు చేయడం వల్ల. ఇలాంటి వాళ్ళకు ధ్యాన సాధన అన్నా, ధర్మమన్నా, సత్యమన్నా అవగతం కాదు.

ఎన్నో వేలమంది పత్రి గారి ధ్యాన యజ్ఞానికి వస్తూ ఉంటారు. అందులో కొంతమంది చూడ్డానికి, కొంతమంది సాధన కోసం వస్తారు. కాని చూడ్డానికి వచ్చినవారు, వాళ్ల మలిన మనస్సు వల్ల అక్కడ ధ్యానం చేయలేరు, చెప్పిన జ్ఞానం స్వీకరించలేరు.

మనసు మలినం అయినప్పుడు ఇంద్రియాలకు మంచిని స్వీకరించే శక్తి ఉండదు. అందుచేత పాపపు పనులే చేస్తారు, వారు ఈ ధ్యాన మార్గంలోకి రాలేరు. మలినమైన మనసుతో చిత్తం శాంతించదు. చిత్తం శాంతిగా లేకపోతే సాధన కుదరదు. చిత్తం ప్రశాంతంగా ఉండాలి అంటే మనసు శుద్ధిచేసుకోవాలి.

అందుకే అష్టావక్రుడు, బుద్ధుడు లాంటివాళ్లంతా విషయాసక్తి తగ్గించుకోమని చెప్పారు. అంటే ప్రాపంచిక విషయాలను విషంలా భావించ మన్నారు. కారణం సాధనా మార్గంలో అవి చాలా పెద్ద అడ్డు కాబట్టి. అంతేకాదు అవి ఇంద్రియాలను మలినం చేస్తాయి కాబట్టి.

అందుచేత మనస్సు శుద్ధం కావాలంటే తీవ్ర ధ్యాన సాధన చేయాలి. సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి.

**2) శుద్ధ మనస్సు:-**

ధ్యానంలో మనస్సు శుద్ధం చేసుకున్నవారికి పాపమంటే ఏమిటో తెలుస్తుంది, పుణ్యమంటే ఏమిటో తెలుస్తుంది. అందుచేత పాపం చేయరు, పుణ్యమే చేస్తారు.

అలా మనసు శుద్ధత్వం పొందినప్పుడు పుణ్యకర్మలు అంటే మంచి పనులు చేస్తూ ఉంటారు. మనస్సు శుద్ధమైనప్పుడు అన్నీ భగవంతుడే! అంతా ఆయనే అనే అనన్య భక్తిలోకి వస్తారు. ఆలా అనన్య భక్తిలోకి వచ్చినప్పుడు పుణ్యకర్మలన్నీ నిష్కామ కర్మలుగా చేస్తూ కర్మయోగంలోకి వస్తారు. ఆలా కర్మయోగంలోకి వచ్చినప్పుడు, కర్మ ఫలాన్ని త్యాగం చేయడం వల్ల పుణ్య కర్మలన్నీ కర్మయోగంగా మారతాయి. చివరకు అది యజ్ఞకర్మ అవుతుంది, సత్కర్మ అవుతుంది. ఇప్పుడు వారు ధ్యానంలోకి వస్తారు.

మొదట్లో రాఘవరావు గారికి వెంకటేశ్వర స్వామి అంటే విపరీతమైన భక్తి వుండేది. ఏది చేసినా బాలాజీ అంటూనే చేసేవారు. దాన ధర్మాలు చేసేవారు. వారి దానధర్మాల ఫలితమే వారికి చక్కటి సద్గురువు పత్రిగారు దొరికారు, ఆయన ద్వారా సత్యం దొరికింది, ధర్మం దొరికింది.

కానీ శుద్ధ మనస్సు వల్ల వారు బాగుపడతారు, తరువాత తనలాంటి వాళ్ళందరి బాగుకోసం కృషిచేస్తారు. ఆలా 'సర్వేజనా సుఖినోభవంతు' అని అనడం కాదు ఆచరణలో పెట్టడం అన్నది గురువు వల్ల నేర్చుకుంటారు.

**3) విశుద్ధ మనస్సు :-** తీవ్ర ధ్యాన సాధన ద్వారా మనస్సు విశుద్ధత్వంలోకి అంటే విశేషమైన శుద్ధత్వంలోకి వచ్చినప్పుడు అరిషడ్ వర్గాలు ఆధీనంలోకి వస్తాయి.

కారణం సద్గురువు దగ్గరికి వెళ్ళగానే ఆయన చెప్పే మొట్టమొదటి విషయం ఏమిటి అంటే నువ్వు జీవుడివి కాదు, నువ్వే దేవుడివి అని చెప్తారు. ఆ తర్వాత నువ్వే కాదు సృష్టిలో అన్ని జీవులు దైవమే అని చెప్తారు.

అలా గురువు "అహం బ్రహ్మాస్మి" అని మొదట నేర్పుతాడు. తర్వాత "తత్వమసి" అని చెప్తాడు. ఆ తర్వాత "సర్వం ఖల్విధం బ్రహ్మ" అంటే ఈ సృష్టి అంతా బ్రహ్మమయమే అని చెప్తారు. అలా విశుద్ధత్వంలోకి వచ్చినప్పుడు విశేషమైన జ్ఞానం వస్తుంది .

విశుద్ధత్వంలోకి వచ్చినప్పుడు నేను అనేది ఏదీ లేదు ఉన్నదంతా భగవంతుడే అని తెలుస్తుంది. అంతేకాదు నేను ఇచ్చేది ఎవరికి? పుచ్చుకునేది ఎక్కడ? అని కూడా తెలుస్తుంది.

ఈ సృష్టిలో అత్మ అయిన నేను ఈ దేహమనే తొడుగు వేసుకుని వచ్చాను అని తెలుస్తుంది. అంటే నేను శాంతిగా జీవించడం, జ్ఞానం పొందడం కాదు, ధర్మంగా జీవిస్తూ ఈ సృష్టిలో అందరూ కూడా ఎందుకు వచ్చారో తెలుసుకుంటారు.

మానవ జన్మ అర్థం ఏమిటి? జీవిత పరమార్ధం ఏమిటి? ఆ పరమార్ధం పొందడానికి, గమ్యాన్ని చేరుకోవడానికి, లక్ష్యం వైపు పయనించడానికి కావాల్సింది ధ్యాన సాధన అన్నది తెలుసుకుంటారు.

అందుచేత పత్రిగారు లాంటి గురువును ఆశ్రయించి ధ్యాన సాధన నేర్చుకుని, విశేషంగా చేస్తూ విశుద్ధత్వంలోకి వచ్చినపుడు నేను ఆత్మ అని తెలుసుకుంటారు.

విశుద్ధత్వంలో కోరికలు అంటూ ఉండవు. కారణం ఎవరికి ఏది కావాలో, ఎవరికి ఏ అర్హత ఉందో! వాటిని ప్రకృతి ద్వారా పొందుతూనే వుంటారు.

అలా విశుద్ధత్వంలోకి వచ్చినపుడు నేను కోరుకో వలసింది ఏమీ లేదు, నాకు రావలసినవి వచ్చాయి, నాకు కావలసినవన్నీ ఉన్నాయి అని గ్రహించి జీవుడుగా వచ్చిన వాడు దేవుడిగా ఎదుగుతాడు. అలా జ్ఞానం పెంచుకుంటూ నేనే దైవాన్ని, నేనే భగవంతుడిని అహం బ్రహ్మాస్మి అనే తత్వంలోకి వస్తారు.

అంతేకాదు ఎంత విశుద్ధత్వంలో ఉంటారో! అంత గొప్పగా జ్ఞానం పెరుగుతుంది, ఆత్మానుభూతి పొందుతారు.

చూడండి శంకరాచార్యులవారు 14 ఏళ్ల వయసులో ఆత్మానుభూతి

పొందారు అంటే ఆత్మ దర్శనం పొందారు. అంటే ఆయన చిన్నానాటి నుంచే జ్ఞానం పెంచుకున్నారు. మరి వివేకానందుడు 28 సంవత్సరాలకే ఆత్మ దర్శనం పొందాడు. బుద్ధుడు 40 సంవత్సరాలకే ఆత్మ దర్శనం పొందాడు.

ఆలా విశేషమైన జ్ఞానం పొందినవాడు ఎలా ఉంటాడు అంటే? ఒక శంకరాచార్యుడిలా, ఒక వివేకానందుడిలా, ఒక బుద్ధుడిలా ఉంటారు. అంటే వారు లోకం కోసమే పాటుపడుతూ ఉంటారు. విశ్వం కోసమే అహర్నిశలు తపిస్తూ ఉంటారు. పత్రి గారు అలాగే తపించారు. ఆయనలాగే పదిమందికి జ్ఞానం చెప్పాలి అనే కోరిక వచ్చింది అంటే విశుద్ధతత్వంలో ఉన్నట్టే. నేను బాగుపడితే కాదు, నాతో అందరూ బాగుపడాలి అనే కోరిక ఉండాలి.

అందుకే మన ముందున్న వాళ్లని మనం ఉపమానంగా తీసుకున్నప్పుడు మనం ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉంటాయి. మరి మనలో ఏమైనా చెడ్డవి ఉంటే తొలగించుకుంటాం. మంచిని పెంచుకుంటాం. ఆలా పెరిగినప్పుడే జ్ఞానం పెరుగుతుంది.


## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

**a) Whatsapp group** లో మీకు పంపబడుతున్న **Youtube** లింక్ మీద నొక్కినప్పుడు **Tatavarthy Veera Raghava Rao** ఛానెల్ **open** అవుతుంది. **Open** అవ్వగానే **subscribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే **www.tst.org.in/videos/** ఓపెన్ అయిన తరువాత **I** లో **Tatavarthy Veera Raghava Rao** పేరు మీద నొక్కండి. **II & III** లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ **Open** అవుతాయి. **Open** అవ్వగానే **subcribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# మానవుడు ఆచరించవలసిన కొన్ని ధర్మాలు!

మనం రోజూ జ్ఞానపరమైన ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాం. ఎన్ని రోజుల నుంచి తెలుసుకుంటున్నా ఇంకా తెలుసుకోవాల్సింది ఉందీఅంటే? ఈ జ్ఞానం అనంతమైనది అని అర్థమవుతుంది. దీనిని బట్టి జ్ఞానం నేర్చుకోవడానికి ఆత్మలమైన మనకి ఒక జన్మ సరిపోదు, ఎన్నో జన్మలు పడుతుంది అనికూడా అర్థవుతుంది.

కానీ శ్రద్ధ, పట్టుదల ఉంటే వంద జన్మల్లో నేర్చుకునేది చాలా తక్కువ జన్మలలోనే నేర్చుకోవచ్చు. ఎవరైనా మనోస్థితిలో కాకుండా, ఆత్మస్థితిలో వుంటే జ్ఞానం పొందాలనే తపన పెరుగుతుంది.

మనవాళ్ళందరూ కష్టపడి తెల్లవారుజామునే లేచి జూమ్‌లో పాల్గొంటూ జ్ఞానం పొందుతున్నారంటే! అందరూ ఆత్మస్థితిలోకి ఎదిగిన వారని తెలుసుకోవాలి. ఆత్మోధరణ కోసం, ఆత్మ ఉన్నతి కోసం, మోక్షం కోసం ప్రయత్నిస్తున్న వాళ్లే అని మనం కచ్చితంగా చెప్పవచ్చు. వీరందరికి తపన వుందని చెప్పడం కాదు, ఆ తపన ఏమిటో ఆచరణలో పెట్టి చక్కగా చూపిస్తున్నారు. ఎవరైనా సరే ఇంత లోతుగా, ఇంత గొప్పగా జ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం ఒక్క జూమ్ లోనే దొరుకుతుంది. మరి ఇన్ని సంవత్సరాల నుంచి జూమ్ నడపబడుతుంది అంటే అత్మజ్ఞానం మీద ఎన్ని కొత్త విషయాలు నేర్చుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఋషి రుణం తీర్చుకోవడం అంటే ఆ ఋషులందరూ ఉపనిషత్తులు ద్వారా, శాస్త్రాల ద్వారా అందించిన జ్ఞానాన్ని మనం అధ్యయనం చేసి ఆ జ్ఞానాన్ని ఇంకొకరికి చెప్పగలిగినప్పుడు మాత్రమే ఆ 'ఋషి రుణం' మనం తీర్చుకోగలం.

ఈ రోజు మనం అది సత్యమని నమ్మాము. అందుకే బాడీ లెవెల్, మైండ్ లెవెల్ పుస్తకాలు చదవాలని అనిపించదు. ఒక్క ఆత్మ గురించి, ఆత్మ

జ్ఞానం గురించి చెప్పే పుస్తకాల మీదే ఆసక్తి ఉంటుంది. మనం చెప్పే కాన్సెప్ట్ లన్నీ ఆత్మజ్ఞానం మీద, ఆత్మ ఉన్నత స్థితికి ఎట్లా తీసుకెళ్లగలం అన్న విషయాల మీదే ఉంటుంది.

అంటే మన స్వరూపం ఆత్మే అయినా, మనసు యొక్క ప్రభావం వలన మనం దైవాలుగా ఉండలేక పోతున్నాం. ఇవన్నీ తెలుసుకున్నప్పుడు మనసుకి ప్రాముఖ్యం తగ్గించి ఆత్మకి ప్రాముఖ్యం ఇస్తాం.

ఇప్పుడు ఏదైనా ఒక క్లాస్ చెప్తున్నాం అంటే ప్రకృతి మనకి అవకాశం ఇచ్చిందని భావించాలి. మొదట్లో రాఘవరావు గారు చెప్పమన్నప్పుడు నాకు చెప్పడం ఏమి వచ్చు? నాకేం తెలుసని అనుకున్నాను. అంతకు ముందు ఏదో విష్ణు సహస్ర నామం, లలిత సహస్ర నామం పారాయణాలన్నీ చేశాను. కానీ నాకు సంస్కృతం తెలియక వాటిలో ఉన్న పదాలకు అర్థాలు చెప్పలేక, నేను చెప్పలేనేమో అనుకునేదాన్ని.

కానీ అప్పుడు పత్రిగారు కాని, రాఘవరావు గారు కానీ నువ్వు చెప్పగలవు అంటుంటే! నాకేం తెలియదు, నాకేమి తెలుసు అని నన్ను నేనే తక్కువగా అంచనా వేసుకునే దాన్ని. కాని ధ్యాన సాధన చేస్తున్నప్పుడు చెప్తేనే కదా నాకు వచ్చొ! రాదో! తెలిసేది అని అనిపించి, చెప్పడం మొదలు పెట్టాను. అప్పుడు నాకు అనిపించింది, ఒక గురువు గారు చెప్పారు అంటే నాలో గొప్పతనం ఉంటేనే కదా? చెపుతారు అని అనుకున్నాను.

ఎందుకంటే? భర్త ఎంత గొప్పవాడైనా అంగీకరించ బుద్ధి కాదు. కానీ మెల్లిమెల్లిగా రాఘవరావు గారి గొప్పతనం నాకు అర్థమైంది. అలా మొదలు పెట్టి, తెలిసిందానిని చిన్న చిన్నగా చెప్పుతున్నప్పుడు మెల్లిగా అలవాటైంది. అలా పుస్తకాల్లో చదివి, పత్రిగారు చెప్పినవి విని చెప్తున్నప్పుడు అందరూ బాగుంది అంటున్నప్పుడు నాలో ఇంకా, ఇంకా చెప్పాలి అనే ఆసక్తి పెరిగింది. అంతేకాదు ఇంకా నేర్చుకోవాలి, ఇంకా బాగా చెప్పాలి అనే పట్టుదల పెరిగింది.

ముందర నేను నేర్చుకుంటేనే కదా చెప్పగలను అని అనుకుని, ధ్యాన

సాధన ఇంకా ఎక్కువ చేస్తూ, పుస్తకాలు చదువుతూ, చెప్పడానికి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడం చేసేదాన్ని. పత్రి గారు స్వాధ్యాయానికి ఎంతో విలువ ఇస్తారు అని అప్పుడే నాకు అర్థమైంది.

ఆ స్వాధ్యాయమే లేకపోతే ఈరోజు మనమందరం కూడా ఏమీ తెలుసుకోనట్టే! ఏమీ నేర్చుకోనట్టే, ఆత్మలమైన మనం మానవులలాగే అంటే జీవుడులాగే జీవించేవాళ్లం.

ఎప్పుడైతే మనస్సు శుద్ధి చేసుకుంటామో! సాత్వికం నుండి శుద్ధ సాత్వికంలోకి వస్తాము. అప్పుడు సాధన మీద శ్రద్ధ, జ్ఞానం మీద తపన వస్తాయి. అప్పుడు అత్మలమైన మనం పరమాత్మలుగా ఎదుగుతాము. అంటే ఆ లక్షణాలు సంపాదించుకుంటాము. ప్రవర్తనలో మార్పులు తెచ్చుకుంటాము. అంతేకాదు పరమాత్మలమైన మనం భూమ్మీద ఉండగా చేయవలసిన ధర్మాలు కూడా తెలుసుకుంటాం.

ఎందుకంటే? మానవ జన్మకి ఏ ఇతర జీవులకు లేని కొన్ని ధర్మాలు వున్నాయి. రోజూ మనం చెప్పుకునే సందేశాలు అన్నీ కూడా మనం ఆచరించ వలసిన ధర్మాలే. మరి ఆ ధర్మాల్లో ఎన్ని ఆచరిస్తున్నాం? ఇంకా ఆచరించవలసిన ధర్మాలు ఎన్ని వున్నాయో కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే అన్నీ ఆచరించకపోతే మళ్ళీ భూమి మీదకి రావాల్సిందే. ఎందుచేతనంటే? ఒక్క మానవ జన్మకే జ్ఞానం పొందే అర్హత వుంది కాబట్టి.

అందుకే మానవ జన్మ రావడమే గొప్పదని శంకరాచార్యుల వారు వివేక చూడామణిలో చెప్పడం జరిగింది.

ఆలా మానవుడిగా పుట్టిన వాళ్ళు, ధర్మాన్ని పూర్తిగా ఆచరించాలి. అంటే ఏమి ఆచరించాలో తెలుసుకుందాం.

ముఖ్యంగా

1) పరబ్రహ్మను ఆశ్రయించాలి.

2) వేదజ్ఞానాన్ని తెలుసుకోవాలి.

3) యజ్ఞము అంటే లోకకళ్యాణ కరమైన కర్మలు చెయ్యాలి.

4) ఆత్మకర్మలు అంటే ముక్తి కర్మలు చెయ్యాలి.

ఈ నాలుగు ఎప్పుడూ ఆచరిస్తూ ఉండాలి. ప్రాపంచిక జీవితంలో ఉన్న వాళ్ళు అంటే ఆధ్యాత్మికత అంటే తెలియని వాళ్ళకి వీటి గురించి తెలియదు.

మనం ఆధ్యాత్మికమార్గంలోకి వచ్చాము కాబట్టి కొంచెం కొంచెంగా తెలుసుకుంటూ, ఏది అవసరమో అది ఆచరించడానికి ప్రయత్నిస్తున్నాము.

ఆధ్యాత్మిక జీవితంలో ముందు పరబ్రహ్మను ఆశ్రయించాలి.

**1)పరబ్రహ్మను ఆశ్రయించాలి:-**

పరబ్రహ్మ అంటే ఎవరోకాదు ఈ సృష్టిని సృష్టిచేసిన సృష్టికర్త, ఆయననే పరమాత్మ, విశ్వాత్మ, మూలాత్మ, భగవంతుడు అంటారు. పత్రీజీ 'ఆత్మే పరబ్రహ్మం' అని జ్ఞాన నవరత్నాలలో చెప్పారు.

ఈ పరబ్రహ్మ చేతనే సృష్టి అంతా నడపబడుతోంది. జీవులు, జీవరాసులు, నదులు, కొండలు, కోనలు ఇవన్నీ సృష్టించినవాడు ఆ పరబ్రహ్మమే.

ఇక్కడ పరా అంటే కనిపించని, బ్రహ్మ అంటే అన్నిటికంటే గొప్పవాడు అని అర్థం. అందుచేత ఆ బ్రహ్మము కంటే గొప్పవాడు ఎవడు లేడు. ఆ పరబ్రహ్మం యొక్క చైతన్య శక్తితోటే ఈ సృష్టి నడపబడుతోంది అని ఈ ఆధ్యాత్మిక మార్గంలో గురువులు బోధించే మొట్టమొదటి బోధ.

అంతేకాదు అందరూ ఆరాధించే దేవుళ్ళు అందరికీ అంటే ఈ ముక్కోటి దేవతలకు కూడా శక్తినిచ్చేది ఆ పరబ్రహ్మమే అని తెలుసుకోవాలి. అందుచేత ఎవరైతే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తారో! ఆ పరబ్రహ్మం యొక్క శక్తిని పొందగలుగుతారు, పరబ్రహ్మని తెలుసుకో గలుగుతారు.

కాని పరబ్రహ్మను కాకుండా దేవతలను ఆరాధిస్తే ప్రాపంచిక భోగాలే కలుగుతాయి. కానీ ఆ పరబ్రహ్మను ఆరాధిస్తే అంటే ధ్యానిస్తే మోక్షమే లభిస్తుందని పరమ గురువులు చెప్తారు.

అందుకే బ్రహ్మము యొక్క గొప్పతనం గురించి తెలుసుకున్నవారు

ప్రపంచంలో ఉన్నవాటికి ప్రాముఖ్యం ఇవ్వకుండా, ఈ ప్రపంచానికే శక్తినిచ్చే పరబ్రహ్మకు ప్రాముఖ్యం ఇస్తారు. కాని ఇది ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన వాళ్ళు మాత్రమే చేయగలుగుతారు. అందుకే ఎవరైనా బ్రహ్మము గురించి తెలుసుకోవాలి అంటారు.

చూడండి కలెక్టర్ ఆఫీస్ లో జవానుని పట్టుకుంటే పనులు అవ్వవు, కలెక్టర్ ను పట్టుకుంటేనే పనులు అవుతాయి. అలాగే దేవుళ్ళను కాకుండా పరబ్రహ్మను ఆశ్రయించాలి, అంటే ధ్యానించాలి. ఇదే మానవులు తెలుసుకోవలసిన మొదటి ధర్మం.

**2) వేదజ్ఞానాన్ని తెలుసుకోవాలి:**

వేదజ్ఞానము అంటే సత్యజ్ఞానము అంటే ఆత్మజ్ఞానము. ఇక్కడ సత్యము అంటే నిత్యమైనది, శాశ్వతమైనది, ఎల్లప్పుడూ ఉండేది, మార్పుచేందనిది. ఇన్ని లక్షణాలు కలిగినదే సత్యం. అటువంటి లక్షణాలు సృష్టిలో ఒక్క పరబ్రహ్మకు మాత్రమే ఉన్నాయి. అందుచేత పరబ్రహ్మ ఒక్కడే సత్యం. కారణం ఆయన సృష్టింపబడలేదు, ఆయనకు అంతం లేదు, ఆయన మార్పుచెందని శాశ్వతమైన వాడు. అంతగొప్పవాడు పరబ్రహ్మ.

ఈ విషయాలన్నీ వేదాలలో, వేదసారమైన ఉపనిషత్తులలో కూడా ఇవ్వబడ్డాయి, అందుకే వాటిని అధ్యయనం చేయాలి అంటారు.

చూడండి కృతయుగంలో, త్రేతా యుగంలో సద్గురువులు, ఋషులు, శిష్యులకి ఈ జ్ఞానమంతా చెప్పేవారు. ఇవన్నీ వ్రాతపూర్వకంగా వేదాలు, ఉపనిషత్తుల రూపంలో వ్యాసభగవానుడు ఇవ్వడం జరిగింది.

ఋషులందరూ వేదాల ద్వారా, ఉపనిషత్తుల ద్వారా సృష్టిలో ఉన్న నిగూఢమైన రహస్యాలు అంటే సృష్టిలో ఏమేమి ఉన్నాయి, అవి ఎలా పొందవచ్చో బోధించారు. అంతేకాదు ఈ సృష్టికి ప్రతిరూపమే మానవ దేహమని కూడా వివరించారు.

మరి ఇవన్నీ వ్రాసి వేదాలలో, ఉపనిషత్తులలో ఉంచారు. అవన్నీ

చదవకపోతే, తెలుసుకోకపోతే ఈ సృష్టి గురించి అర్థం కాదు.

నాలుగు వేదాల సారం కూడా పత్రి గారి పుస్తకాల్లో ఉంది. ఇప్పుడు రాఘవరావు గారుకూడా తన పుస్తకాలలో ఈ జ్ఞానాన్ని అందించడానికి ఎంతో కృషి చేస్తున్నారు. ఆయన ఒక్కోసారి పడుకుని మధ్యలో లేస్తారు. ఎందుకు? అని అడిగితే కరెక్షన్ ఉంది అంటారు. రేపు చేసుకోవచ్చు కదా అంటే? కాదు ఇప్పుడే చేయాలి అంటారు, అంత తాపత్రయ పడతారు. ఇది అందరికీ సాధ్యం కాదు.

50 ఏళ్లకు పైగా నేను ఆయనతో వున్నాను, కాని నేను ఆయనను అందుకోలేక పోతున్నాను. కారణం ఆయన ఆత్మస్థితి అటువంటిది.

అందుకే సత్యజ్ఞానం నేర్చుకోవాలి అంటే? వేదాధ్యాయనం చేయాలంటారు.

అప్పుడే ఈ వేద జ్ఞానం ప్రతి ఒక్కరికి బోధపడుతుంది. ఈ వేద జ్ఞానం నేర్చుకోవడం అన్నది మానవుల యొక్క ఇంకొక ధర్మం.

**3) యజ్ఞము అంటే లోకకల్యాణ కరమైన పనులు:-**

లోకుల మంచి కోసం పదిమంది కలసి చేసే పనిని యజ్ఞం అంటారు. అందులో అన్నిటికంటే గొప్పయజ్ఞం 'ధ్యానయజ్ఞం'.

కారణం ధ్యానం అన్నది, చేసేవారిలో ఎంతో మార్పు తీసుకు వస్తుంది. వారి మనసును మంచిగా మారుస్తుంది. అందువల్ల వారు అందరికీ సేవలు చేస్తారు, అందరికీ లాభాలు కలిగించే పనులు చేస్తారు, అందరికీ ధ్యానాన్ని, జ్ఞానాన్ని పంచే ప్రయత్నం చేస్తారు, అందరిలో పరివర్తన తీసుకు వస్తారు. ఆలా వారు మారడమే కాకుండా అందరిలో మార్పు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తారు. అందుచేత ధ్యానయజ్ఞమే లోకంలో జరిగే గొప్ప యజ్ఞం.

మనవాళ్లు ఇదంతా ఎందుకు చేస్తున్నారు? అంటే లోకంలో అందరూ ఈ జ్ఞానం గురించి తెలుసుకోవాలనే. దానికోసం అంతా సెల్ ఫోన్స్ వాడుతూన్నారు. ఈ జ్ఞానానికి సంబంధించిన వీడియోస్ అన్నీ యూట్యూబ్, వాట్సాప్,

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పెట్టడమే కాదు,  షార్ట్ వీడియోస్ కూడా పెడుతున్నారు. ఒక సందేశంలోని సారం మెసేజిగా సూక్ష్మంగా పెడుతున్నారు. ఇదంతా అందరూ జ్ఞానులుగా మారాలని చేస్తున్నారు.

ఇదంతా స్వార్థం లేకుండా, నేను చేస్తున్నాను అనే అహం లేకుండా, నాకు పేరు రావాలి అనే కోరిక లేకుండాపరోపకార దృష్టితో చేస్తున్నారు. ఆలా అందరూ ఒక యజ్ఞంలా  చేస్తున్నారు.

అలా నువ్వు ఏదైతే పొందుతున్నావో! అది నిస్వార్ధంగా ప్రపంచానికి ఇవ్వగలిగితే అంతకన్నా మించిన యజ్ఞం లేదు.

అలా నిస్వార్థంగా లోకకళ్యాణం కోసం కృషి చేయడం అంటే యజ్ఞాలు చేయడం మానవ ధర్మాలలో ఒక ధర్మం.

**4) అత్మ కర్మలు అంటే ముక్తి కర్మలు చెయ్యాలి:-**

మానవుడు చేసే కర్మలు 3 రకాలు. 1. పాప కర్మలు. 2. పుణ్యకర్మలు. 3. అత్మ కర్మలు అంటే ముక్తి కర్మలు.

పాప కర్మలు చేస్తే దుఃఖం కలుగుతుంది, పుణ్య కర్మలు చేస్తే భోగం కలుగుతుంది కానీ మరల జన్మ వస్తుంది. కాని ముక్తి కర్మలు అంటే ఆత్మ కర్మలు చేస్తే మోక్షమే వస్తుంది మరల జన్మలు రావు.

అందుచేత ఆత్మకు లాభించే ధ్యాన సంబంధమైన సేవలు ముక్తి కర్మలుగా భావించ బడతాయి.

అంటే ధ్యానం చేయడం, ధ్యానం చెప్పడం, ధ్యానానికి సంబంధించిన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, వాటికి సహకరించడం, అటువంటి కార్యక్రమాలకు ధనరూపేణా, తనువు రూపేణా, సాయం చేయడం లాంటివన్నీ ముక్తి కర్మల క్రిందకి వస్తాయి. కానీ ఈ కర్మలన్నీ నిష్కామంగా ఫలితం ఆశించకుండా చేయాలి.

అందుకే భగవద్గీతలో  కర్మలు చేయడానికే నీకు అధికారం ఉంది కాని కర్మఫలాన్ని ఆశించే అధికారం లేదు అని చెప్పబడింది.

అందుచేత ఎవరైతే నిష్కామంగా ఆత్మ కర్మలు చేస్తారు వారు ముక్తిని పొందుతారు అందుచేత ఆత్మ కర్మలు కూడా మానవుని ధర్మాలలో ఒక ధర్మం అని తెలుసుకోవాలి.

అందుచేత మానవుడు ఆచరించవలసిన ధర్మాలలో ఈ నాలుగు ధర్మాలు ముఖ్యమైన వని తెలుసుకోవాలి. కారణం ఈ నాలుగు ధర్మాలు మానవులకు మోక్షాన్ని అంటే జన్మరాహిత్యాన్ని కలిగిస్తాయి కాబట్టి.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

**a) Channel Name : Tatavarthy Veera Raghava Rao.** ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

**b)** అలాగే **PMC** వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క **YouTube Channel** ప్రారంభించారు. **Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao**

**c)** తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు **Tatavarty Spiritual Trainees** ఛానెల్‌లో చూడండి.

**d) Direct** గా **YouTube app** లోకి వెళ్ళి **search bar** లో **Tatavarthy Veera Raghava Rao** అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# "అజ్ఞానుల్లో రకాలు"

జ్ఞానం అన్నది ఎంతో విలువైనది. జ్ఞానం ఉన్నవాళ్ళని ఈ ప్రపంచంలో చాలా గొప్పగా, గౌరవంగా, దేవుళ్లగా కూడా భావిస్తారు.

కాని అజ్ఞానంలో ఉన్నవారికి ఈ జ్ఞానం విలువ తెలియక డబ్బు, పదవులు, డిగ్రీలే గొప్పవని భావిస్తారు. కానీ అవన్నీ తాత్కాలికం, కానీ జ్ఞానం అనేది శాశ్వతం. అంటే ఎన్ని జన్మలు ఎత్తినా జ్ఞానం కూడా వస్తుంది కాబట్టి.

జ్ఞాని గురువు దగ్గర వినయంతో విద్యను అభ్యసించి, తాను ఎవరో తెలుసుకుంటూ, ఈ సృష్టి అంతా పరమాత్మ మయమే అని తెలుసుకుంటూ, ఎప్పుడూ ఆనంది స్థితిలో ఉంటాడు.

అందుచేత అజ్ఞాని ఎలా ఉంటాడో? ఎందుకు అజ్ఞానంలో వుండిపోతున్నాడో తెలుసుకుంటే దాన్ని వదిలించుకునే ప్రయత్నం చేస్తారు. అజ్ఞానులు మూడు రకాలు.

1) అజ్ఞుడు

2) అశ్రద్ధ ధ్యానుడు.

3) సంశయాత్ముడు. వీరంతా అజ్ఞానంలో వున్నవారే.

**1) అజ్ఞుడు:-** అజ్ఞుడు అంటే ఏ వేదశాస్త్రాలు, ఏ ధర్మశాస్త్రాలు తెలియవు, తెలుసుకోడు. వాడికి దేవుడు ఎవరు? తాను ఎవరు? అన్నవి తెలియదు. వాడికి జీవిత లక్ష్యం కాని, చేరుకోవాల్సిన గమ్యం కాని తెలియదు. వాడు ఆధ్యాత్మికతలోకి రాలేదు, జ్ఞానం పొందలేదు. సద్గురువు వీళ్ళకు తారస పడినా గుర్తించలేడు. అజ్ఞుడు అంటే అజ్ఞానంలో ఉన్నవాడు జనన మరణ చక్రంలో చిక్కుకున్నవాడు అని అర్థం.

**2) అశ్రద్ధ ధ్యానుడు:-** వీళ్ళకు గురువు మీద నమ్మకం ఉండదు, శాస్త్రాలు చదువుతూ ఉంటారు, సద్గురువు చెప్పింది ఆచరించడానికి, ధ్యానం చేయదానికి ఇష్టపడరు. విగ్రహారాధన చేస్తూ వుంటారు, జీవహింసకు కారణమైన మాంసం

తింటుంటారు.

నాకు అన్నీ తెలుసు అనుకుంటారు. వీరికి సత్యం అవగతం కాదు, ధ్యాన సాధన చేయలేరు.

ఉపనిషత్తుల్లో ఆత్మే భగవంతుడు, ఆత్మే గొప్పది అని చెప్పబడినా చదవక, ఎవరైనా చెప్పినా అర్థంకాక అజ్ఞానంలోనే ఉండిపోతారు. అందుకే అశ్రద్ధ ధ్యానులు సాధన మీద శ్రద్ధ చూపెట్టలేరు. భగవంతుడు అంటే ఇష్టం అంటారు కాని పూజలు మానరు. వీళ్ళకి సద్గురువు మీద నమ్మకం, విశ్వాసం వుండదు.

**3) సంశయాత్ములు:** వీళ్ళకి శాస్త్రాల పట్ల, అన్నింటి పట్ల సంశయమే. చదువుతారు, వింటారు, కాని సాధించగలమో? లేదో? అనే సంశయంతో వుంటారు.

వీరు ధ్యానంలోకి వచ్చినా సరే గురువుని నమ్మరు, చెప్పింది వినరు. పూజ మానేస్తే ఎలాగా? ఇంట్లో ఏమన్నా అరిష్టం జరుగుతుందేమో అని సందేహిస్తూ వుంటారు.

వీరికి సరైన అవగాహన ఉండదు, పూర్వజన్మ వాసనలు, సంస్కారాలు వీరిని ఎదగనివ్వవు. వీరు పూజా చేస్తారు, ధ్యానము చేస్తారు. అంటే రెండు పడవల మీద కాలు పెట్టి ప్రయాణం చేస్తారు.

అలాగే భగవంతుణ్ని ఆరాధించే అసలైనమార్గం ధ్యానం మాత్రమే అని సద్గురువు చెప్పినా సంశయాత్ములకి అర్థం కాదు. వీళ్ళు గురువునే అనుమానిస్తారు.

చదివినా, విన్నాసరే అన్నిటి మీదా సంశయంతో ఉంటారు. ఈ సంశయాత్ముడు కర్తవ్యం పాటించలేడు.

పూర్వం రోజుల్లో కట్టెల పొయ్యి మీద వంట చేసేవారు. ఇప్పుడు గ్యాస్ స్టవ్ మీద చేస్తున్నారు. పూర్వం సెల్ ఫోన్లు లేవు, కాని ఇప్పుడు ప్రతి వాడి చేతిలోనూ సెల్ ఉంది. ఇన్ని మార్పులు అంగీకరిస్తున్నారు కాని ఆధ్యాత్మిక మార్గంలో మార్పులు మాత్రం సంశయిస్తారు.

ఇటువంటి వారు ఆత్మ గురించి, పరమాత్మ గురించి బాగా అధ్యయనం చేస్తేకాని సంశయాలు పోవు. ఏది ఏమైనా గురువు దగ్గర స్థిరంగా ఉండకపోతే ఏదీ నేర్చుకోలేరు. ఈ అనుమానం అనే స్థితి నుంచి బయటపడితేనే అజ్ఞానం పోతుంది.

అజ్ఞుడు తెలియక అజ్ఞానంలో ఉంటాడు. తెలుసుకుంటే తప్పకుండా జ్ఞానిగా మారతాడు.

అలాగే అశ్రద్ధధ్యానుడు గురువును ఆశ్రయించి ఆయన దగ్గర సాధన చేస్తే జ్ఞానం పొందుతాడు. సంశయాత్ముడు కూడా గురువు చెప్పింది ఆచరిస్తే జ్ఞానం పొందుతాడు.

అన్నం ఉడికిందో లేదో తెలియడానికి అన్నమంతా చూడక్కర్లేదు. ఒక్క మెతుకు పట్టుకుంటే చాలు, అన్నం సంగతి తెలుసుకోవచ్చు. అలాగే భీమవరం ఆత్మజ్ఞాన శిబిరంలో ఒక్కసారి పాల్గొంటే చాలు ఎటువంటి వారికైనా అంతా అర్థమవుతుంది.


చూడండి వెదురు కర్రకు పొడుగును బట్టి విలువ ఉంటుంది, చెరుకు గడికి లావును బట్టి రసం ఎక్కువ వస్తుంది కాబట్టి విలువ ఉంటుంది, పాలకి దానిలోనుంచి వచ్చే వెన్నను బట్టి విలువ ఉంటుంది. అలాగే మనిషికి వాడికున్న జ్ఞానాన్ని బట్టి విలువ ఉంటుంది. సృష్టిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క దానివల్ల విలువ ఉంటుందని తెలుసుకోవాలి.

మానవులు డబ్బు, పదవులు, హోదా గొప్పవనుకుంటారు కాని ఇవన్నీ తాత్కాలికమే! తాత్కాలిక మైనవి, శాశ్వతం కానివి గొప్పవి ఎలా అవుతాయి? శాశ్వతమైన జ్ఞానమే గొప్పది, విలువైనదని తెలుసుకోవాలి.

అందుకే జ్ఞానిని అందరూ గౌరవిస్తూ ఉంటారు. వివేకానందుడు, రామకృష్ణ పరమహంస, రమణ భగవానుడు లాంటి వారికి ధనం, సంపదలు ఏమీలేకపోయినా వారిని గొప్పవాళ్లుగా గుర్తిస్తారు, గౌరవిస్తారు, వారి బోధలు ఆచరిస్తారు.

కనుక మనిషికి శోభనిచ్చేది, కీర్తి ప్రతిష్టలు తెచ్చేది జ్ఞానం మాత్రమే. జ్ఞానులకు ప్రేమతత్వం ఉంటుంది, ప్రేమతో ఉంటారు, సత్యంపై ఆసక్తి వుంటుంది, సత్యమే మాట్లాడతాడు, సత్యంలో జీవిస్తారు.

అందుచేత జ్ఞానం గొప్పతనం తెలుసుకొండి, అజ్ఞానంలో ఉండకండి, జ్ఞానవంతులు కావడానికి ప్రయత్నించండి. **"అజ్ఞానంతో పుట్టడం తప్పు కాదు. అజ్ఞానిగా మరణించడమే తప్పు"** అంటారు మహాత్ములు. అందుకే అజ్ఞానం తొలగించుకోండి, "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయండి.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం వున్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.

నిర్వహించు ప్రదేశం: **శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.**

ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం

వివరాలకు : **సింధూర**
సెల్ : 85559 95217

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | |
|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/- | 27) దత్తాత్రేయుని 24 మంది గురువులు- రూ.70/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/- | 28) దుఃఖ నివారణామార్గం - రూ.60/- |
| 3) జీవిత సత్యాలు - రూ.130/- | 29) బ్రహ్మజ్ఞానం - రూ.60/- |
| 4) భగవంతుడంటే - రూ.130/- | 30) ధ్యానం (పత్రీజీ) - రూ.60/- |
| 5) సత్యమార్గం - రూ.160/- | 31) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/- |
| 6) ఆత్మ శాస్త్రం - రూ.130/- | 32) అతీంద్రియ శక్తులు - రూ.60/- |
| 7) ధ్యాన శాస్త్రం - రూ.130/- | 33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.60/- |
| 8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం-రూ.160/- | 34) భూతదయే దైవత్వం - రూ.60/- |
| 9) ధ్యాన శక్తి - రూ.130/- | 35) ఆలోచించండి - రూ.60/- |
| 10) తెలుసుకోండి - రూ.130/- | 36) షిరిడీ సాయి సందేశాలు - రూ.60/- |
| 11) జీవిత సూక్ష్మాలు - రూ.130/- | 37) నిర్వాణ మార్గం - రూ.60/- |
| 12) మరణించక ముందే మరణించాలి- రూ.130/- | 38) సంకల్పమంటే? - రూ.50/- |
| 13) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.160/- | 39) ఈ జీవితం ఎందుకు? - రూ.50/- |
| 14) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/- | 40) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/- |
| 15) గీతాసందేశం - రూ.120/- | 41) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/- |
| 16) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/- | 42) సత్యం - రూ.40/- |
| 17) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/- | 43) చక్రాలు - రూ.40/- |
| 18) కర్మ సిద్ధాంతం - రూ.80/- | 44) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/- |
| 19) ధ్యానమంటే ? - రూ.80/- | 45) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/- |
| 20) త్రివిధాలు - రూ.80/- | 46) మౌన ధ్యానం - రూ.40/- |
| 21) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/- | 47)మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/- |
| 22) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/- | 48) శాకాహారమే మానవాహారం - రూ.15/- |
| 23) జ్ఞాన జ్యోతి - రూ.70/- | 49) అహింస మరియు శాఖాహారం- రూ.15/- |
| 24) జ్ఞాన కుసుమాలు - రూ.70/- | |
| 25) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/- | |
| 26) జ్ఞానమాల (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.70/- | |

పుస్తకముల కొరకు :


## తటవర్తి వీర రాఘవరావు,

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్: 9440309812, 9490171853



దత్తాత్రేయుడు ప్రకృతి నుంచి 24మంది గురువుల్ని ఎంచుకున్నారు. ఆయన ఆ గురువులనుంచి నేర్చుకుని ఒక జ్ఞాన భాండాగారంగా నిలిచారు.

యదు మహారాజు ఆయన్ని చూసి స్వామి మీరు ఎంతో ఆనంద స్వరూపుడిగా కనిపిస్తున్నారు, ఒక జ్ఞాన భాండాగారంగా కనిపిస్తున్నారు. ఇంత ఆనందాన్ని, జ్ఞానాన్ని మీరు ఎలా పొందారు? మీకు సంసారం కాని, భార్య పుత్రులు కాని ఎవరు ఉన్నట్టు కనిపించడం లేదు. అయినా కూడా ఇంత ఆనంద స్వరూపులుగా ఎలా కనిపిస్తున్నారు? అని దత్తాత్రేయస్వామి వారిని అడగడం జరిగింది.

అప్పుడు దత్తాత్రేయుల వారు నేను పెద్దల నుంచి, యోగులనుంచే కాదు, ప్రకృతిలోని ఎన్నో వాటి నుంచి కూడా నేర్చుకున్నాను అన్నారు. అందుచేత దత్తాత్రేయుల వారిగా తయారవ్వాలంటే ప్రకృతిలో వున్న ఎన్నిటినో గురువులుగా ఎంచుకొని వాటి నుంచి ఎంతో జ్ఞానాన్ని నేర్చుకోవాలి.

**- తటవర్తి రాజ్యలక్ష్మి**

రూ.70/-